


RNI TELTEL/2024/89620

తెలంగాణ

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక




ప్రచురణ : తెలంగాణ | సంపుటి 02 | సంచిక 331 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | బుధవారం 09 - సెప్టెంబర్ - 2026 | వెల రూ. 5 /-

## కేసీఆర్ ఫాంహౌస్ ముట్టడి

### ఫాంహౌస్ వద్ద 144 సెక్షన్ విధింపు



- అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు
- కేసీఆర్ ఫాంహౌస్ ముట్టడికి పిలుపునిచ్చిన కాంగ్రెస్ ఎస్సీ సెల్
- ఫాంహౌస్ వైపు వెళ్లే అన్ని రహదారులను దిగ్బంధించిన పోలీసులు

▸▸2

## కేసీఆర్‌ను చంపే కుట్ర జరుగుతోంది

### కేటీఆర్ సంచలన ఆరోపణలు

- కాంగ్రెస్ చేపట్టిన ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి కార్యక్రమంపై కేటీఆర్ ధ్వజం
- కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని విమర్శ
- ప్రభుత్వంపై డైవర్షన్ రాజకీయాల ఆరోపణ
- అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్
- దళిత, గిరిజన హామీలు అమలు చేయాలని డిమాండ్



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ శ్రేణులు కుట్రపూరితంగా హత్యాయత్నం చేశాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని మండి పడ్డారు. ఫాంహౌస్‌కు వెళుతున్న తమను అరెస్ట్ చేసి బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ నివాస ప్రాంగణం వరకు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ఎలా అనుమతించారని కేటీఆర్ ప్రశ్నించారు. తమ సొంత ఇంటికి తాము వెళుతుంటే పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారో డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ శ్రేణుల దాడులను పట్టించుకోకుండా బీఆర్ఎస్ నేతలను మాత్రమే పోలీసులు లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. ప్రజల దృష్టిని ప్రభుత్వ వైఫల్యాల నుంచి మళ్లించేందుకే డైవర్షన్ రాజకీయాలకు తెరలేపారని అన్నారు. "డైవర్షన్, డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్ తప్ప రేవంత్‌రెడ్డికి మరో విద్య తెలియదు" అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ సమావేశాల సమయాన్ని ప్రజా సమస్యలపై ఉపయోగించాలని కేటీఆర్ సూచించారు. కేసీఆర్, బీఆర్ఎస్ నేతలను విమర్శించేందుకు సభను ఉపయోగించుకోవడం సరి కాదన్నారు. ఇందుకోసం ఒక రోజు కేటాయించి.. మిగిలిన రోజుల్లో ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు. దళితులపై ప్రభుత్వానికి నిజమైన ప్రేమ ఉంటే దళిత, గిరిజన డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని కేటీఆర్ కోరారు. దళితబంధు కింద ఒక్కొక్కరికి రూ.12 లక్షలు ఇస్తామని చెప్పి.. కనీసం రూ.12 పైసలు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని.. సరైన సమయం వచ్చినప్పుడు ఈ ప్రభుత్వానికి ప్రజలే సమాధానం చెబుతారని కేటీఆర్ అన్నారు.

---

వాయు కాలుష్యంపై

## కేంద్రం సర్వే..

లక్నో టాప్, హైదరాబాద్ 19, విశాఖ 21



- స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026 ర్యాంకుల్లో లక్నోకు అగ్రస్థానం
- 10 లక్షల జనాభా నగరాల కేటగిరీలో ఢిల్లీకి 21వ ర్యాంక్
- విశాఖతో కలిసి 21వ ర్యాంక్ పంచుకున్న దేశ రాజధాని నగరం
- గాలి నాణ్యతతో కాకుండా కాలుష్య నియంత్రణ చర్యల ఆధారంగా ఈ ర్యాంకులు
- హైదరాబాద్‌కు 19వ స్థానం, ముంబైకి 28వ ర్యాంక్

▸▸2

బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలపై

## సస్పెన్షన్ వేటు



- బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై చర్యలు తీసుకోవాలని శాసనసభలో తీర్మానం
- తీర్మానాన్ని ప్రవేశపెట్టిన మంత్రి దామోదర రాజనర్సింహ
- స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడమే ఇందుకు కారణం
- కేసీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని తీర్మానంలో డిమాండ్

▸▸2

---

## మంత్రుల శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా - మహేశ్ గౌడ్



కేబినెట్ విస్తరణ ఊహాగానాలపై మహేశ్ గౌడ్ స్పందన

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై సూచనలు చేశానని వెల్లడి

తనకు మంత్రి పదవి ఇవ్వడం అధిష్ఠానం నిర్ణయమన్న మహేశ్ గౌడ్

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో కేబినెట్ విస్తరణ, మంత్రుల శాఖల మార్పుపై ఊహాగానాలు షికారు చేస్తున్న వేళ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. గాంధీ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం కేబినెట్‌లో ఉన్న మంత్రుల శాఖలన్నింటినీ సమూలంగా పునర్వ్యవస్థీకరించి, కొత్త శాఖలను కేటాయించాలని తాను కాంగ్రెస్ హైకమాండ్‌కు స్పష్టమైన సూచన చేసినట్లు వెల్లడించారు. పీసీసీ అధ్యక్షుడిగా తన పరిధి మేరకు పార్టీ ప్రయోజనాల కోసం ఈ సలహా ఇచ్చానని... దానిపై తుది నిర్ణయం తీసుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధిష్ఠానం చేతిలోనే ఉందన్నారు. ఇక తనను మంత్రివర్గంలోకి తీసుకునే అంశంపై స్పందిస్తూ... ఆ విషయాలన్నీ అధిష్ఠానం నిర్ణయానికే వదిలేశానని తెలిపారు. ప్రస్తుతం పార్టీని బలోపేతం చేసే బాధ్యత కలిగిన పీసీసీ అధ్యక్షుడిగా నిరంతరం పనిచేస్తున్నానని పేర్కొన్నారు.

## ప్రధాని మోదీ సభ వేదిక వద్ద కలకలం..

### నకిలీ పీఎంఓ ఐడీ, గన్‌తో ఇద్దరు అదుపులోకి!

- ఒకరి వద్ద నకిలీ పీఎంఓ ఐడీ కార్డు, మరొకరి వద్ద గన్ గుర్తింపు
- ముంబైలోని అంబానీ కల్చరల్ సెంటర్‌లో ఘటన
- భద్రతా డ్రిల్ నిర్వహిస్తుండగా పట్టుకున్న పోలీసులు
- గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో పాల్గొననున్న ప్రధాని మోదీ



▸▸2

## మహిళల ముందు హరీశ్ రావు బట్టలు విప్పుతారా? : సీతక్క ఫైర్



- దళిత వర్గానికి చెందిన స్పీకర్ కు గౌరవం ఇవ్వడం లేదన్న సీతక్క
- సబితను తోసింది ఎవరో విజువల్స్ చూస్తే తెలుస్తుందన్న మంత్రి
- మహిళా పోలీసు అధికారులపై బీఆర్ఎస్ నేతలు దుర్భాషలాడిన దృశ్యాలు రికార్డయ్యాయని వెల్లడి

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అత్యంత హేయమైన, అనుచిత వ్యాఖ్యలు చేసి, ఇప్పుడు ఏమీ ఎరుగనట్లు తప్పించుకోవాలని చూస్తున్నారని పంచాయతీ రాజ్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ... బీఆర్ఎస్ నేతల తీరును ఎండగడుతూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. "సభలో దళిత వర్గానికి చెందిన స్పీకర్ స్థానానికి గౌరవం ఇవ్వకపోగా, గతంలో ఎప్పుడో మరణించిన ఆయన మాతృమూర్తిని ఉద్దేశించి అంత నికృష్టమైన భాష మాట్లాడటం ఏ రకమైన సంస్కారం?" అని నిలదీస్తూ కంటతడి పెట్టారు. సీతక్క ఆవేదన చూసి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కూడా సభలోనే కన్నీళ్లు పెట్టుకోవడంతో వాతావరణం అత్యంత గంభీరంగా మారింది...

▸▸2

## బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్–2026 పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి

- బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని ప్రచారం చేసే ఛాలెంజ్
- అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్న కోమటిరెడ్డి
- తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటాలని ఆకాంక్ష



▸▸2

## కేసీఆర్‌ను ఎలా కాపాడుకోవాలో మాకు తెలుసు - జగదీశ్ రెడ్డి



- కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కేసీఆర్ ఫాంహౌస్ వైపు పంపడం ఏ రకమైన సంస్కారమన్న జగదీశ్ రెడ్డి
- కేసీఆర్‌ను అంతమొందించేందుకే వెళుతున్నామని ఓ ఎమ్మెల్యే అన్నారని మండిపాటు
- కేసీఆర్ పైకి కావాలనే నిరసనకారులను పంపుతున్నారని ఆగ్రహం

▸▸2

# ప్రధాని మోదీ సభ వేదిక వద్ద కలకలం.. నకిలీ పీఎంఓ ఐడీ, గన్‌తో ఇద్దరు అదుపులోకి!

**మొదటిపేజీ తరువాయి..** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొననున్న కార్యక్రమ వేదిక వద్ద కలకలం రేగింది. నకిలీ గుర్తింపు కార్డు, తుపాకీతో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ పరిణామంతో భద్రతా వర్గాలు ఒక్కసారిగా అప్రమత్తమయ్యాయి. ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో ఉన్న నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్ (ఎన్ఎంఏసీసీ) వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రధాని మోదీ మంగళవారం సాయంత్రం జరగనున్న 'గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ (జీఎఫ్ఎఫ్) 2026' ప్రారంభోత్సవానికి హాజరుకావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి పోలీసులు భద్రతా ఏర్పాట్లను సమీక్షిస్తూ డ్రిల్ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని విచారించగా, 24 ఏళ్ల రోహన్ పరేఖ్ అనే వ్యక్తి తనను తాను ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) అధికారిగా పరిచయం చేసుకున్నాడు. అతని వద్ద ఉన్న గుర్తింపు కార్డును పరిశీలించగా అది నకిలీదని తేలింది. అదే సమయంలో అతని గన్ మన్ వద్ద ఉన్న తుపాకీని కూడా పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వెంటనే వారిద్దరినీ అదుపులోకి తీసుకున్న పోలీసులు, తదుపరి దర్యాప్తు నిమిత్తం ఈ కేసును ముంబై క్రైమ్ బ్రాంచ్‌కు అప్పగించారు. ప్రస్తుతం అధికారులు వారిని ముమ్మరంగా విచారిస్తున్నారు. వారి మొబైల్ ఫోన్లు, గుర్తింపు పత్రాలు, ఇతర సామాగ్రిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఆరోపణలు నిర్ధారణ అయిన అనంతరం వారిపై తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన నేపథ్యంలో ప్రధాని పర్యటనకు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

# కేసీఆర్ ఫాంహౌస్ ముట్టడి

**ఫాంహౌస్ వద్ద 144 సెక్షన్ విధింపు**

**మొదటిపేజీ తరువాయి..** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యల తీవ్ర పర్యవసానాలు ఇప్పుడు కేసీఆర్ ఫాంహౌస్ వరకు పాకాయి. గజ్వేల్ నియోజకవర్గం ఎర్రవెల్లి గ్రామంలోని కేసీఆర్ ఫామ్‌హౌస్ ను ముట్టడించేందుకు కాంగ్రెస్ ఎస్సీ సెల్ పిలుపునివ్వడంతో అక్కడ ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్ నిరసనకారుల యత్నాలను, ఇరువర్గాల ఘర్షణలను అడ్డుకునేందుకు పోలీసులు ఎర్రవెల్లి పరిసర ప్రాంతాల్లో తక్షణమే 144 సెక్షన్ విధించారు. ఫామ్‌హౌస్ వైపు వెళ్లే అన్ని ప్రధాన రహదారులను బారికేడ్లతో దిగ్బంధించి, పోలీసు వాహనాలతో పహారా కాస్తున్నారు. మర్కుక్ పోలీస్ స్టేషన్ వద్ద కూడా భారీగా మోహరించిన పోలీసులు, ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని తరలించేందుకు డీసీఎం వ్యాన్లను కూడా సిద్ధంగా ఉంచారు. ఇదే సమయంలో ఎర్రవెల్లి గ్రామంలో బీఆర్ఎస్ శ్రేణులు ఏర్పాటు చేసిన ధర్నా శిబిరాన్ని పోలీసులు బలవంతంగా ఎత్తివేయడంతో పరిస్థితి రణరంగంగా మారింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల సవాళ్లు, పోలీసుల మోహరింపులతో ఎర్రవెల్లి పరిసరాల్లో హైటెన్షన్ వాతావరణం నెలకొంది.

# బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్–2026 పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి



**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణ విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలకు సజీవ ప్రతీక అయిన బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడంతో పాటు యువతలోని సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న 'బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ 2026'ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ, రోడ్లు–భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎఫ్‌డీసీ ఎండీ జీ. ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, సెట్విన్ మాజీ చైర్మన్ గిరిధర్ రెడ్డిలతో కలిసి సచివాలయంలో ఈ ఛాలెంజ్ అధికారిక పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ... షార్ట్ ఫిలింలు, బతుకమ్మ పాటలు, సృజనాత్మక వీడియోల ద్వారా తమ ప్రతిభను చాటుకోవాలనుకునే యువ ఫిలిం మేకర్లకు ఈ ఛాలెంజ్ ఒక అద్భుత వేదికగా ఉపయోగపడుతుందన్నారు. బతుకమ్మ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, జానపద కళలు, సంప్రదాయాలతో పాటు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కూడా ప్రతిబింబించేలా షార్ట్ ఫిలింలను రూపొందించవచ్చని తెలిపారు. ఈ పోటీల్లో యువ దర్శకులు, విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటాలని ఆకాంక్షించారు.

# వాయు కాలుష్యంపై కేంద్రం సర్వే..

**- లక్నో టాప్, హైదరాబాద్ 19, విశాఖ 21**

**మొదటిపేజీ తరువాయి..** దేశవ్యాప్తంగా తీవ్ర వాయు కాలుష్యంతో సతమతమవుతున్న ఢిల్లీ, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన 'స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026' ర్యాంకుల్లో ఆసక్తికరమైన ఫలితాన్ని సాధించింది. 10 లక్షలకు పైగా జనాభా ఉన్న నగరాల కేటగిరీలో ఢిల్లీ 21వ స్థానంలో నిలిచింది. తీవ్ర శీతాకాలపు పొగమంచు, విషపూరిత గాలి ఉన్నప్పటికీ.. బెంగళూరు (32వ ర్యాంక్), శ్రీనగర్ (26వ ర్యాంక్) వంటి నగరాలను ఢిల్లీ వెనక్కి నెట్టడం గమనార్హం. అయితే, ఈ ర్యాంకులు నగరాల్లోని గాలి నాణ్యతకు ప్రతిబింబం కాదు. కాలుష్య నియంత్రణకు నగరాలు తీసుకుంటున్న చర్యల ఆధారంగానే ఈ సర్వేను నిర్వహించారు. ఈ కేటగిరీలో 198 పాయింట్లతో లక్నో అగ్రస్థానంలో నిలవగా, ఇండోర్ రెండో స్థానంలో, జబల్‌పూర్ (195 పాయింట్లు) మూడో స్థానంలో నిలిచాయి. ఢిల్లీ 172 పాయింట్లతో విశాఖపట్నంతో కలిసి 21వ స్థానాన్ని పంచుకుంది. గతేడాది 32వ స్థానంతో పోలిస్తే ఢిల్లీ తన ర్యాంకును మెరుగుపరుచుకోవడం విశేషం. ఇతర ప్రధాన నగరాలైన హైదరాబాద్ 19వ స్థానంలో, పాట్నా 16, ముంబై 28, చెన్నై 35, కోల్‌కతా 38వ స్థానాల్లో నిలిచాయి.

**ర్యాంకుల వెనుక అసలు కథ**

జాతీయ స్వచ్ఛమైన గాలి కార్యక్రమం (NCAP) కింద కేంద్రం ఈ సర్వేను నిర్వహిస్తోంది. కేవలం గాలి నాణ్యత స్థాయులను కాకుండా, కాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను ఈ సర్వే మదింపు చేస్తుంది. రోడ్ల పై దుమ్ము నిర్వహణ, ఘన వ్యర్థాల తొలగింపు, వాహన, పారిశ్రామిక ఉద్గారాల తగ్గింపు, నిర్మాణ వ్యర్థాల నిర్వహణ, ప్రజల్లో అవగాహన వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. అందువల్ల, గాలి నాణ్యత తక్కువగా ఉన్న నగరం సైతం.. నియంత్రణ చర్యలను బలంగా అమలు చేస్తే మెరుగైన ర్యాంకు సాధించే అవకాశం ఉంటుంది. ఢిల్లీ విషయంలో ఇదే జరిగింది.

**ఢిల్లీలో వాస్తవ పరిస్థితి**

ర్యాంకు మెరుగైనప్పటికీ, ఢిల్లీలో కాలుష్య స్థాయిలు ప్రమాదకరంగానే ఉన్నాయి. 2025లో పీఎం10 కణాలు జాతీయ సగటు (60 $\mu g/m^3$) కంటే చాలా ఎక్కువగా 198 $\mu g/m^3$గా నమోదయ్యాయి. అలాగే పీఎం2.5 కణాలు కూడా నిర్దేశిత పరిమితి (40 $\mu g/m^3$) కంటే రెట్టింపునకు పైగా 97 $\mu g/m^3$గా రికార్డయ్యాయి. 2026 జనవరిలో గాలి నాణ్యత అత్యంత ప్రమాదకర స్థాయికి పడిపోవడంతో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (GRAP) స్టేజ్ IV ఆంక్షలను కూడా విధించారు.

మొత్తం 130 నగరాల్లో ఈ సర్వే నిర్వహించగా, 3–10 లక్షల జనాభా కేటగిరీలో రవుర్కెలా, 3 లక్షల లోపు జనాభా కేటగిరీలో కళింగ నగర్ ప్రథమ స్థానాల్లో నిలిచాయి.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలపై సస్పెన్షన్ వేటు

**మొదటిపేజీ తరువాయి..** బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ సమావేశాల కాలం మొత్తం వారిని సస్పెండ్ చేస్తున్నట్లు మండలి చైర్మన్ ప్రకటించారు. అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ తాతా మధు, నవీన్ కుమార్‌లపై కాంగ్రెస్ పక్షం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

**తీర్మానం ప్రవేశపెట్టిన దామోదర**

స్పీకర్‌పై అగౌరవంగా మాట్లాడటం తో పాటు, అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ నేతల ప్రవర్తనపై ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంత్రి దామోదర రాజనర్సింహ శాసనసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత కేసీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ, ఎస్సీల చరిత్ర జాతీయ ఆత్మగౌరవంతో ముడిపడి ఉందని, దానిని కేవలం ఒక సామాజిక వర్గానికే పరిమితం చేయకూడదని అన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, కానీ రాజ్యాంగబద్ధమైన పదవులను, వ్యవస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంటుందని స్పష్టం చేశారు. "స్పీకర్ పదవి ఏ ఒక్క కులానికో, మతానికో సంబంధించినది కాదు. ఆ అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తిని అవమానించడం క్షమించరాని నేరం" అని ఆయన వ్యాఖ్యానించారు. అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ నేతల అహంకారం తగ్గలేదని, ప్రజాజీవితంలో ఉన్నవారు బాధ్యతాయుతంగా మెలగాలని సూచించారు. మంత్రి దామోదర ప్రవేశపెట్టిన తీర్మానానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పూర్తి మద్దతు తెలిపారు. రాజ్యాంగ వ్యవస్థల గౌరవాన్ని కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీలో ఈ తీర్మానం ఆమోదం పొందిన అనంతరం, అధికారిక కాపీని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి పంపించారు. దీంతో నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరు ఎమ్మెల్సీలపై మండలిలో చర్యలు తీసుకున్నారు.

# మహిళల ముందు హరీశ్ రావు బట్టలు విప్పుతారా?

**- సీతక్క ఫైర్**

**మొదటిపేజీ తరువాయి..** సభలో ప్రతిపక్ష నేతల తీరుపై మండిపడ్డ సీతక్క... "సబితా ఇంద్రారెడ్డిని నిజంగా తోసింది ఎవరో విజువల్స్ చూస్తే తెలుస్తుంది. మహిళా ఎమ్మెల్యేలను ముందు పెట్టుకుని రావడం ఏంటి? హరీశ్ రావు మహిళల ముందు బట్టలు విప్పుతారా?" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. "మహిళా ప్రజాప్రతినిధులను సురక్షిత ప్రాంతానికి పంపి, ఆ తర్వాత పురుష నేతలు నిరసనకు రావడం పద్ధతి. కానీ మహిళలను అడ్డుగా పెట్టుకుని రాజకీయం చేయడం దారుణం" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న మహిళా పోలీస్ అధికారులపై బీఆర్ఎస్ నేతలు చేయిచేసుకుని, దుర్భాషలాడిన దృశ్యాలు రికార్డయ్యాయని, చట్టాన్ని ఉల్లంఘించి పోలీసులను కొట్టిన ఎమ్మెల్యేలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్టసభలు దేవాలయం లాంటివని, బీఆర్ఎస్ మహిళా నేతలు ఈ విషయంలో ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. "సొంత చెల్లెలు కవితను పార్టీ నుంచి బహిష్కరించినప్పుడు లేని బాధ, హరీశ్ రావును ఏదైనా అంటే ఎందుకు వస్తోంది?" అని సీతక్క బీఆర్ఎస్ నేతలను సూటిగా ప్రశ్నించారు.

# కేసీఆర్‌ను ఎలా కాపాడుకోవాలో మాకు తెలుసు : జగదీశ్ రెడ్డి

**మొదటిపేజీ తరువాయి..** తాము బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో పని చేస్తున్న క్రమశిక్షణ కలిగిన సైనికులమని... కాంగ్రెస్ ప్రభుత్వ అణచివేత చర్యలకు, పోలీసుల అక్రమ అరెస్టులకు తాము ఏమాత్రం భయపడేది లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ దారుణాలను, వైఫల్యాలను ప్రజల కళ్లకు కట్టినట్లు ఎండగడుతుంటే తట్టుకోలేకనే ప్రతిపక్షంపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ నడుస్తుండగా ప్రభుత్వ విప్‌లు, అధికార పార్టీ ఎమ్మెల్యేలను డప్పులు కొట్టుకుంటూ కేసీఆర్ ఫాంహౌస్ వైపు పంపడం ఏ రకమైన సంస్కారమని జగదీశ్ రెడ్డి నిలదీశారు. 'కేసీఆర్‌ను అంతమొందించేందుకే వెళుతున్నాం' అని ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే బహిరంగంగానే తీవ్ర వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఆయనపై పోలీసులు వెంటనే సుమోటోగా కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌పైకి కావాలనే నిరసనకారులను పంపుతున్నారని, పోలీసులు వారిని ఆపకపోతే బీఆర్ఎస్ శ్రేణులే రంగంలోకి దిగి తగిన రీతిలో బుద్ధి చెబుతాయని జగదీశ్ రెడ్డి హెచ్చరించారు. కేసీఆర్‌ను కాపాడుకోవడం తమకు, తెలంగాణ సమాజానికి పెద్ద కష్టమేమీ కాదని తేల్చిచెప్పారు. శాసనసభకు వస్తున్న ప్రజాప్రతినిధులను అడ్డుకోవడంపై తాము హైకోర్టును ఆశ్రయించగా... ప్రతిపక్ష ఎమ్మెల్యేలను అసెంబ్లీకి రాకుండా ఎవరు, ఎందుకు అడ్డుకున్నారనే వివరాలను రెండు వారాల్లో సమర్పించాలని అత్యున్నత న్యాయస్థానం ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆ భయంతోనే రాత్రికి రాత్రే బీఆర్ఎస్ నేతలపై తప్పుడు కేసులు నమోదు చేశారని ధ్వజమెత్తారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, ప్రజలకు తాగడానికి, సాగుకు నీళ్లు ఇవ్వలేక, పేదల భూములను గుంజుకుని అమ్ముకుంటూ కాంగ్రెస్ నేతలు సొంత జేబులు నింపుకుంటున్నారని దుయ్యబట్టారు.

బుధవారం | హైదరాబాద్
09 - 09 - 2026
www.netisubhodaya.com
నేటి శుభోదయ



## బీఎస్పీ పార్టీ నాగరాజ్ ఆధ్వర్యంలో హమారా ప్రసాద్ అరెస్ట్ చేయాలని భారీ ర్యాలీ




**శేరిలింగంపల్లి, నేటి శుభోదయ, సెప్టెంబర్ 8 :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, హఫీజ్‌పేట్ లోని డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద డా.బిఆర్. అంబేద్కర్ పై హమారా ప్రసాద్ చేసిన అవమానకర వ్యాఖ్యలను బీఎస్పీ తీవ్రంగా ఖండిస్తు బీఎస్పీ నాయకులు నాగరాజ్ ఆధ్వర్యంలో హఫీజ్‌పేట్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో కొండాపూర్ బీఆర్ ఎస్ పార్టీ ఎండి. అల్లావుద్దీన్ పటేల్, టీజీ సీనియర్ మెంబర్ , ఆల్ ఇండియా ఎస్సీ ఆర్పీ సొసైటీ నేషనల్ యూత్ ప్రెసిడెంట్ హనుమంతరావుఆర్ ఆర్ జిల్లా ప్రెసిడెంట్, బీఎస్పీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ భగవాన్ దాస్, తెలంగాణ రాజ్యాధికార పార్టీ కొండాపూర్ డివిజన్ అధ్యక్షులు ఎండి. జహంగీర్, కొండాపూర్ డివిజన్ బీఎస్పీ జనరల్ సెక్రటరీ ఎండి. జలీల్ , మియాపూర్ డివిజన్ బీఎస్పీ ప్రెసిడెంట్ జి. శ్రీను, అసెంబ్లీ ఇంచార్జ్ బీఎస్పీ పార్టీ పి. చిన్న , లింగంపల్లి బీఎస్పీ నాయకులు చంద్రశేఖర్, యూత్ ప్రెసిడెంట్ సంతోష్, క్రిస్టియన్ కమ్యూనిటీ నాయకులు గురుదాస్, జైశీల్ ఈకార్యక్రమాని కి అన్ని రాజకీయ నాయకులు మద్దతు తెలిపారు.

## ఉప సర్పంచుల హక్కులు కాపాడాలి
### - రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం



**మహేశ్వరం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08 :** ఉప సర్పంచుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ పంచాయతీరాజ్ కమిషనర్ దివ్యా మేడంను రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందించారు. ఉప సర్పంచుల చెక్ పవర్‌ను యథాతథంగా కొనసాగించాలని, గ్రామాల్లో అభివృద్ధి పనుల శిలాఫలకాలపై ఉప సర్పంచుల పేర్లు ముద్రించాలని,పంచాయతీ తీర్మానాలపై సంతకం చేసే అవకాశం కల్పించాలని కోరారు. అలాగే మండలస్థాయి సర్వసభ్య సమావేశాలకు ఉప సర్పంచులను తప్పనిసరిగా ఆహ్వానించాలని విజ్ఞప్తి చేశారు.శిలా ఫలకాలపై ఉప సర్పంచుల పేర్లు ముద్రించే అంశంపై త్వరలో జీవో జారీకి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు ఫోరం ప్రతినిధులు తెలిపారు.హక్కుల కోసం ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడుతున్న ఉప సర్పంచులు,మండల అధ్యక్షులను ముందస్తు అరెస్టులు చేయడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర అధ్యక్షుడు బొట్లా కార్తీక్,ప్రధాన కార్యదర్శి మట్టా శ్రీనివాస్ గౌడ్,రంగారెడ్డి జిల్లా ఉప సర్పంచుల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మరి నరేష్ ఎగిరిశెట్‌తో పాటు వివిధ జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.ఉప సర్పంచుల చట్టబద్ధ హక్కులను ప్రభుత్వం పరిరక్షించాలని వారు డిమాండ్ చేశారు

## హైదరాబాద్‌లో పీడీఐ టెక్నాలజీస్ సీటీఓ రఘు బొంగుల పర్యటన
### - ఏఐ వ్యూహం వెల్లడి



**శేరిలింగంపల్లి, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08 :** నాలుగు దశాబ్దాలుగా ప్రపంచ వ్యాప్తంగా రిటైల్, పెట్రోలియం రంగాలకు టెక్నాలజీ పరిష్కారాలు అందిస్తున్న పీడీఐ టెక్నాలజీస్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ రఘు బొంగుల సెప్టెంబర్ 7 నుంచి 9 వరకు మాదాపూర్, జూబ్లీ ఎన్‌క్లేవ్‌లోని ఎస్‌వీజీ బిల్డింగ్ లో ఉన్న హైదరాబాద్ కార్యాలయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా భారత ఇంజినీరింగ్, ప్రొడక్ట్ బృందాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సంస్థ భవిష్యత్ ప్రణాళికలు, ఏఐ ఆధారిత పరివర్తన వ్యూహాన్ని వెల్లడించారు. ఉత్పాదకత పెంపు, వేగవంతమైన అభివృద్ధి, ఉత్పత్తుల నాణ్యత, కస్టమర్ కేంద్రిత సేవలపై దృష్టి పెట్టాలని, ఏఐ, నూతన సాంకేతికతలను ప్రొడక్ట్ డెవలప్‌మెంట్‌లో సమగ్రంగా వినియోగించాలని పిలుపునిచ్చారు.ప్రస్తుతం హైదరాబాద్, చెన్నై, బెంగళూరు కార్యాలయాల్లో కలిపి దాదాపు 600 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని, భారత్ పీడీఐకి ముఖ్యమైన ప్రతిభ, సాంకేతికత, ఆవిష్కరణల కేంద్రంగా ఎదిగిందని వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ ఇంజినీరింగ్, హైదరాబాద్ సెంటర్ హెడ్ రవి మొచర్ల తెలిపారు. భారత బృందాలను మరింత విస్తరించి, గ్లోబల్ ఉత్పత్తుల్లో భాగస్వామ్యం పెంచుతామని ఆయన పేర్కొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే నా ప్రధాన లక్ష్యం..! - కేఎల్ఆర్



**మహేశ్వరం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08:** మహేశ్వరం అంసెబ్లీ నియోజకవర్గం క్యాంపు కార్యాలయంలోరూ.35 లక్షల విలువగల 60 సీఎంర్ఫ్ చెక్కులను లబ్ధిదారులకుఅందజేత ప్రతి కుటుంబానికి చేరే వరకు మనం విశ్రాంతి లేకుండా పనిచేద్దాంప్రజల ఆశీర్వాదాలతో, కాంగ్రెస్ పార్టీ నాయకత్వంతో మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధికి నేను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని స్పష్టంమాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జీ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జీ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం అంసెబ్లీ నియోజకవర్గం క్యాంపు కార్యాలయంలో 60 సీఎంర్ఫ్ చెక్కులు, రూ.35 లక్షల విలువగల చెక్కులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంర్ఫ్ ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారి కుటుంబాలకు ఎంతోకొంత ఉపశమనం లభించిన్నట్లు అవుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల కోసం పనిచేస్తోందన్నారు. పేదలు, ఆపదలో ఉన్న కుటుంబాలు, వైద్య సహాయం అవసరమైన ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అండగా నిలుస్తోందని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అభివృద్ధి,సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు వివరించారు. కష్టాల్లో ఉన్న కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న భరోసా. ఒక కుటుంబం ఆపదలో ఉన్నప్పుడు ప్రభుత్వం వారి పక్కన నిలబడాలనే గొప్ప ఆలోచనతో ఈ పథకం అమలవుతోందన్నారు. మహేశ్వరం నియోజకవర్గ ప్రజలకు నేను ఎప్పుడూ అందుబాటులో ఉంటాను, ప్రజల సమస్యల పరిష్కారమే నా ప్రధాన లక్ష్యం, ఎవరికైనా ప్రభుత్వ పథకాల విషయంలో ఇబ్బందులు ఉన్నా, వైద్య సహాయం కావాలన్నా, ఇతర ప్రజా సమస్యలు ఉన్నా మన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చాన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా ప్రజలకు.. ప్రభుత్వానికి మధ్య వారధులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి అర్హులైన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం వైపు వేగంగా ముందుకు సాగుతోంది.. ఆ అభివృద్ధి ఫలాలు మహేశ్వరం నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి చేరే వరకు మనం విశ్రాంతి తీసుకోకుండా పనిచేద్దామన్నారు. ప్రజల ఆశీర్వాదాలతో, కాంగ్రెస్ పార్టీ నాయకత్వంతో మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధికి నేను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. పలు గ్రామాల ప్రజాప్రతినిధులు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తూ బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డ నీరుడి శ్రీరాములు

**మహేశ్వరం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08 :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం.62వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నీరుని శ్రీరాములు మాట్లాడుతూ... తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు చేసినట్లు ఆరోపిస్తున్న అనుచిత వ్యాఖ్యలను ఖండించిన నీరుడి శ్రీరాములు స్పీకర్ పదవి ఏ ఒక్క పార్టీకి, వ్యక్తికి సంబంధించినది కాదని, అది శాసనసభ గౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నతమైన శాసనసభ స్పీకర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం తగదని అన్నారు. ముఖ్యంగా దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని, ఇలాంటి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగబద్ధ పదవుల గౌరవాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాల్సిన అవసరం ఉందని నాయకులు అన్నారు. ఈ తరహా వ్యాఖ్యలకు బీఆర్ఎస్ నాయకులు బాధ్యత వహించాలని బాలాపూర్ మండలం 62వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నీరుడి శ్రీరాములు డిమాండ్ చేశారు.



## కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఆగ్రహం
### - మెట్టుగూడలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం

**సికింద్రాబాద్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08:**

420 హామీలు, 6గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చినకాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఒక్క హామీని కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని మాజీ కార్పొరేటర్ డా. సామల హేమ ఆరోపించారు. మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా మంగళవారం మెట్టుగూడ అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ శ్రేణులు ప్రత్యేక నిరసన కార్యక్రమం చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంద సామల హేమ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో జాప్యం జరుగుతోందని, ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు సరైన పరిష్కారం చూపడంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు, ప్రజా సమస్యలపై ప్రభుత్వ దృష్టిని ఆకర్షించేందుకు ఈ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కంది శైలజ, కంది నారాయణ, వనమల భాస్కర్, చింతకింది మల్లేష్, బెజ్జంకి రాజేష్, శైలేందర్, పాక సాయి, మర్పల్లి రవి, శ్రీనివాస్ గౌడ్, ఉండింటి



సచిన్, వేణు గోపాల్ రెడ్డి, తుంగ లక్ష్మణ్, అమర్, బాన్సువాడు సాల్వర్, మహేందర్, నక్క మధు, జింకల మల్లేష్, ఎండి కాజా భాయ్, సునీల్, శీలం సాయి యాదవ్, గుమ్మడవెల్లి మధుకర్, యాదగిరి, శివ, ఒంజరి వెంకటేష్, వనమల అనిల్, గంగాపురం ఆంజనేయులు గౌడ్, సుమలత, సుజాత, గీత, మానస, మంజు, రేణుక ఫరీదా, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## భావప్రకటన స్వేచ్ఛను హరిస్తే నిరసనల హోరు

**హైదరాబాద్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08 :** దేశంలో భావప్రకటన స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని, విలేకరుల స్వేచ్ఛను హరించేందుకు పాలకులు యత్నిస్తే ప్రజాస్వామికవాదుల నుండి తీవ్ర ప్రతిఘటన తప్పదని విలేకరులు హెచ్చరించారు. దేశ రాజధానిలో విధి నిర్వహణలో ఉన్న మహిళా విలేకరులపై పోలీసుల దౌర్జన్యం, అక్రమ కేసులు, నిర్బంధాన్ని నిరసిస్తూ మంగళవారం సాయంత్రం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో విలేకరులు, ప్రజాస్వామికవాదులు కొవ్వొత్తుల నిరసన ప్రదర్శన చేపట్టారు. బషీర్ బాగ్ లోని సంఘ కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ ప్రదర్శన నిజాం కళాశాల మీదుగా జగజ్జీవన్ రాం విగ్రహం వరకు సాగింది. అనంతరం సంఘ రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ అధ్యక్షతన జరిగిన సభలో పలువురు సీనియర్ పాత్రికేయులు మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను, స్వేచ్ఛను కాలరాస్తూ పాలకులు అనుసరిస్తున్న తీరు అప్రజాస్వామికమని జాతీయ విలేకరుల సమాఖ్య మాజీ అధ్యక్షులు దేవులపల్లి అమర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఐదు రోజుల క్రితం విధి నిర్వహణలో ఉన్న మైనారిటీ వర్గానికి చెందిన మహిళా విలేకరులు షాహిన్ ఖాన్, నఫీజా ఖాన్‌లపై పోలీసులు దాడి చేసి అక్రమంగా బంధించడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో విలేకరుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత పాలక వ్యవస్థలపై ఉందని స్పష్టం చేశారు. బాధ్యులైన పోలీసులపై తక్షణమే చర్యలు తీసుకుని, మహిళా విలేకరులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విలేకరుల సమాఖ్య నాయకులు ఎం.ఏ. మాజీద్, వై. నరేందర్




రెడ్డి, కల్లూరి సత్యనారాయణ, కె. అజిత, హైదరాబాద్ విలేకరుల వేదిక ప్రతినిధి అత్తలూరి అరుణ, సంఘ మహిళా విభాగం బాధ్యురాలు రాజేశ్వరి, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు సంధ్య, సీనియర్ పాత్రికేయులు వనజ, స్వప్న, విమల, సంఘ కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఏ. రాజేష్, బి. కిరణ్ కుమార్, శిగా శంకర్ గౌడ్, చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం నాయకులు యూసుఫ్ బాబు, అశోక్, ఛాయాగ్రాహకుల సంఘం ప్రతినిధి కె.ఎన్.హరి, ఉర్దూ విలేకరుల సమాఖ్య ప్రతినిధి గౌస్ మోహియొద్దీన్ తో పాటు పెద్ద సంఖ్యలో విలేకరులు పాల్గొన్నారు.

Neti Shubodyaa 09.09.2026_Layout 1 9/9/2026 6:47 AM Page 4



# ప్రజల కమ్యూనిటీ హాల్‌పై కబ్జా కోరలు

**మలక్ పేట్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08**

ప్రజల సౌకర్యం కోసం నిర్మించిన ప్రభుత్వ ఆస్తులు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల స్థానికుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చార్మినార్ జోన్, మలక్‌పేట్ సర్కిల్‌లో సైదాబాద్ కాలనీలో ఉన్న లోక్‌ఆయుక్త కాలనీ కమ్యూనిటీ హాల్ ప్రస్తుతం అన్యాక్రాంతమైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజల ఉపయోగం కోసం నిర్మించిన ఈ భవనం ఇప్పుడు కొందరి ఆధీనంలో ఉండటం వెనుక అధికారుల నిర్లక్ష్యమా.? లేక తెరవెనుక వ్యవహారాలు న్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



### ప్రజల కోసం నిర్మిస్తే.. కబ్జాదారుల కోసం వదిలేశారా.?

సుమారు 12 ఏళ్ల క్రితం జీహెచ్ఎంసీ తన సొంత నిధులతో కాలనీ వాసుల అవసరాల కోసం కమ్యూనిటీ హాల్‌ను నిర్మించినట్లు స్థానికులు చెబుతున్నారు. కొంతకాలం కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యకలాపాలు కొనసాగగా, సుమారు పదేళ్ల క్రితమే ఆ అసోసియేషన్ గడువు ముగిసిందని పేర్కొంటున్నారు. అప్పటి నుంచి కొత్త అసోసియేషన్ ఏర్పడకపోయినా కమ్యూనిటీ హాల్‌ను మున్సిపల్ అధికారులు తమ ఆధీనంలోకి తీసుకుని పరిరక్షించాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా పరిస్థితులు మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### అసోసియేషన్ లేదు.. మరి తాళాలు ఎవరి చేతుల్లో.?

అసోసియేషన్ లేకపోతే కమ్యూనిటీ హాల్ తాళాలు మున్సిపల్ అధికారుల వద్దే ఉండాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కానీ ప్రస్తుతం తాళాలు కొందరు వ్యక్తుల చేతుల్లోకి ఎలా వెళ్లాయి.? వారికి భవనాన్ని ఉపయోగించే అధికారం ఎవరు ఇచ్చారు.? జీహెచ్ఎంసీ నుంచి ఏమైనా అనుమతి ఉందా.? అన్న ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

### ఫిర్యాదులు ఫైళ్లలోనే, కబ్జా మాత్రం కొనసాగుతూనే

కమ్యూనిటీ హాల్‌ను ఖాళీ చేయించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని పలుమార్లు మలక్ పేట్ సర్కిల్ అధికారులకు స్థానికులు ఫిర్యాదులు చేసినప్పటికీ ఫలితం కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మలక్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు విషయం తెలిసినా చర్యలు తీసుకోకపోవడంపై వారు మండిపడుతున్నారు. ఫిర్యాదులు వస్తున్నా పట్టించుకోకుండా అధికారులు మౌనం వహిస్తుండటంతోనే కబ్జాదారులకు మరింత ధైర్యం వస్తోందని ఆరోపిస్తున్నారు.



### మున్సిపల్ అధికారుల మౌనం ఎందుకు.?

ప్రభుత్వ ఆస్తి పరిరక్షణలో అధికారులు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. కమ్యూనిటీ హాల్‌పై ఎవరికైనా హక్కు లేదా వినియోగ అనుమతి ఉంటే సంబంధిత పత్రాలను అధికారులు బహిర్గతం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా భవనాన్ని వినియోగిస్తుంటే తక్షణమే ఖాళీ చేయించి జీహెచ్ఎంసీ ఆధీనంలోకి తీసుకోవాలని కోరుతున్నారు.

కొంతమంది స్థానికులు మాత్రం అధికారులు, సంబంధిత వ్యక్తుల మధ్య అంతర్గత ఒప్పందాలు జరిగాయా.? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కమ్యూనిటీ హాల్‌ను అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు ఎవరికైనా అధికారులు సహకరించారా.? ప్రభుత్వ ఆస్తి వినియోగంపై ఏమైనా ఆర్థిక లావాదేవీలు జరిగాయా.? అనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే వీటికి సంబంధించిన వాస్తవాలను విజిలెన్స్ అధికారులు స్పష్టమైన విచారణ ద్వారా వెల్లడించాల్సి ఉంది.

### కమిషనర్ కర్ణన్ స్పందించాలి

ప్రజాధనంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను కబ్జా నుంచి కాపాడాల్సిన బాధ్యత జీహెచ్ఎంసీదే. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ కమిషనర్, చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ స్పందించి కమ్యూనిటీ హాల్‌పై సమగ్ర విచారణ జరిపించాలని స్థానికులు కోరుతున్నారు. అనుమతులు లేకుండా ఎవరైనా భవనాన్ని వినియోగిస్తుంటే వెంటనే ఖాళీ చేయించి, తాళాలను మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.
ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ప్రజల కోసం నిర్మించిన భవనం ప్రజలకే దక్కుతుందాm? లేక కబ్జాదారుల ఆధీనంలోనే కొనసాగుతుందా.? అన్నది జీహెచ్ఎంసీ ఉన్నతాధికారుల చర్యలతో తేలాల్సి ఉంది.

# హామీలపై నిలదీస్తే దాడులా? - కేటీఆర్ ఫైర్

**సికింద్రాబాద్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08 :** ఎర్రవెల్లి ఫార్మ్ హౌస్ వద్ద కాంగ్రెస్ శ్రేణులు చేసిన దుశ్చర్యలను ఖండిస్తు అసెంబ్లీ నుండి ఎమ్మెల్యేలు చలో ఎర్రవెల్లి కార్యక్రమాన్ని చేపట్టి బయలు దేరగా హాకింపెట్ వద్ద కేటీఆర్ ను,ఎమ్మెల్యేలు పద్మారావు గౌడ్ ను అరెస్ట్ చేసి బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్ కు తరలించి సాయంత్రం వరకు నిర్బంధించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న సునీత లక్ష్మారెడ్డి పై అత్యంత దారుణంగా దాడి చేశారని, ఆమె చీర లాగి దుర్మార్గంగా ప్రవర్తించారని ఆరోపించారు. చేతకాక స్పీకర్ పేరు పెట్టి రాజకీయం చేస్తున్నారన్నారు. నిన్న మా సభ్యుడు స్పీకర్ ను ఉద్దేశించి ఏమి అనలేదని, వక్రీకరించారని, అయినప్పటికి కూడా తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటు 24గంటల్లోపే రాతపూర్వకంగా వివరణ తెలిపారని చెప్పారు. మోసం చేసిన ప్రభుత్వం పైతెలంగాణా ప్రజల తరుపున హామీల పై అసెంబ్లీలో అడగమని మా అధినేత చెప్పాడని పేర్కొన్నారు. కానీ ఈరోజు సమాధానం చెప్పలేక మా ప్రజా ప్రతినిధుల పై దాడి చేస్తున్నారని, ప్రజలను రేవంత్ రెడ్డి లూటి చేస్తున్నాడని మండి పడ్డారు. రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడా అని నిరుద్యోగులు, తమకు ఇస్తానన్న 2500 ఎక్కడా అని మహిళలు, ఆడపిల్లలకు ఇస్తానన్న స్కూటీలు ఏవని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు ఏమయ్యాయని అడిగితే దాడులు చేస్తున్నారని, నిన్న అసెంబ్లీ లోకి వెళ్ళనివ్వలేదని, నేడు మా కేసీఆర్ దగరికి వెళ్తుంటే వెళ్లకుండా అడ్డుకున్నారని, ఇప్పుడు బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్ లో మా కార్యకర్తలు పై కాంగ్రెస్ గుండాలను పంపి దాడి చేయించారని వెల్లడించారు. పోలీస్ స్టేషన్ కు మాజీ మంత్రి, సనత్నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ చేరుకొని కేటీఆర్ ను, ఇతర నేతలను పరమార్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వం అప్రజాస్వామిక పాలన సాగుతుందని తెలిపారు. అక్రమ కేసులు, అరెస్టులతో నాయకులను, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుందని చెప్పారు. మా అధినేతను ఇంటికి వెళ్లి కలవడానికి కూడా అనుమతులు తీసుకోవాలా అని ప్రశ్నించారు. అసెంబ్లీలో నిలదీస్తామని భయంతోనే తమను నిన్న లోపలకు కూడా అనుమతించలేదని పేర్కొన్నారు. ఇప్పటికే అన్ని వర్గాల నుండి ప్రభుత్వం వ్యతిరేకత ఎదుర్కొంటుందని, ఎప్పుడు ఏ ఎన్నికలు వచ్చిన ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కాంటోన్మెంట్ కాంటెస్టడ్ ఎమ్మెల్యే నివేదిత మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందని తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వెయ్యి రోజుల ప్రజా పాలన అంటూ సంబరాలు చేసుకుంటున్నారని, మాకు ఇచ్చిన హామీలు ఎక్కడ అని ప్రజల తరపున అడిగితే తమ నాయకులపై దాడులు చేయడం, మహిళా ఎమ్మెల్యేలపైన కూడా దుర్మార్గంగా ప్రవర్తిస్తు ప్రజాస్వామ్యాన్ని ఖునీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ప్రభుత్వానికి త్వరలోనే ప్రజలు చరమ గీతం పాడుతారని స్పష్టం చేశారు. కేటీఆర్, పద్మారావు అరెస్ట్ విషయం తెలుసుకొని సీతాఫల్ మండి మాజీ కార్పొరేటర్ సామల హేమ పెద్ద ఎత్తున గులాబీ శ్రేణులతో కలసి బోయిన్ పల్లి స్టేషన్ కు చేరుకొని పోలీసుల చర్యకు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ నేతను కలవడం కోసం ఎరవెల్లికి బయలు దేరిన నేతలను అరెస్ట్ చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తంచేశారు. పార్టీ అధినేతతో పాటు తన తండ్రి అయిన కేసీఆర్ ను కలవనివ్వకుండా కే టీ ఆర్ ను అరెస్ట్ చేయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో జక్కుల మహేశ్వర్ రెడ్డి, డి ఎన్ శ్రీనివాస్, పాండు యాదవ్ మరియు కంటోన్మెంట్ బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని తమ నిరసన వ్యక్తం చేశారు.



# 10న వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం నిర్వహణ

## - జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జ్యోతి

**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** సెప్టెంబర్ 10న ఉదయం 9 గంటలకు ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాల ఎదురుగా చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమంలో వీరనారీ చాకలి ఐలమ్మ విగ్రహానికి పుష్పమాలంకరణ చేయడం జరుగుతుందని, ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ కులస్తులు, కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా బిసి సంక్షేమ అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# అశ్రిత్ గ్రూప్ వెబ్ డెవలపర్ పోస్టులకు ఎంపికైన 6గురు యస్.బి.ఐ.టి. విద్యార్థులు



**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08 :** బెంగుళూరు కేంద్రంగా నడపబడుతున్న ప్రముఖ సంస్థ అశ్రిత్ గ్రూప్‌లో తమ కళాశాలకు చెందిన 6గురు విద్యార్థులు వెబ్‌డెవలపర్‌గా ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. మంగళవారం కళాశాల ఆవరణలో నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ లేఆఫ్‌ల కాలంలో కూడా తమ విద్యార్థులకు ఉద్యోగాలు అందించడంలో తమ వంతు కృషి చేస్తున్నామని, దొరికిన అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగపరచుకోవాలని సూచించారు. సంస్థలో ఈకామర్స్ విభాగం అశ్రిత్ ఫ్రెష్, అశ్రిత్ ఇన్‌ఫోటెక్, సన్‌టెక్ సొల్యూషన్స్ వంటి ఐ.టి., ఐ.టి. అనుభంద సంస్థలు గ్రూప్‌గా కలిగి నిర్వహిస్తున్న అశ్రిత్ గ్రూప్‌లో తమ విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం తమ కళాశాలకు గర్వకారణమని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ డాక్టర్ జి . ధాత్రి తెలిపారు. వెబ్‌డెవలపర్ నియామకాలకు గాను మొదట ఆన్‌లైన్ అస్సెస్‌మెంట్, టెక్నికల్ ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్ మరియు హెచ్.ఆర్ ద్వారా 6గురుని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు 3.8 నుండి 4.5 లక్షల వార్షిక ఆదాయం అందుతుందని కళాశాల వైస్ చైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. 2019లో స్థాపించబడి ఐటి, బిజినెస్ సొల్యూషన్స్, ఈకామర్స్ వంటి విభాగాలలో సేవలందిస్తూ విస్తరిస్తున్న అశ్రిత్ గ్రూప్‌లో తమ విద్యార్థులు ఉద్యోగం సంపాదించటంలో తమ కళాశాలలోని నిరంతర కోడింగ్, అప్టిట్యూడ్, ఎంప్లాయబిలిటి స్కిల్స్‌ల శిక్షణ ఎంతగానో తోడ్పడిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అశ్రిత్ గ్రూప్ సి.ఈ.ఓ. యన్. ఫారూక్, మేనేజింగ్ డైరెక్టర్ యన్. పల్లవి, సీనియర్ హెచ్.ఆర్. సంకీర్తనతో పాటు కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.వి.వి. శివ ప్రసాద్, టి.పి.ఒ. డాక్టర్ యన్. సవిత, డాక్టర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ మండపాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- ముందస్తు సమాచారం ఆధారంగా సమర్థవంతమైన పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ ప్రణాళిక
- పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08 :** గణేష్ మండపాల ఏర్పాటు, నిర్వాహకులు, కమిటీ సభ్యులు, మండపం ప్రాంతం, నిమజ్జన వాహనాలు తదితర వివరాలను నిర్వాహకులు policeportal.tspolice.gov.in ఆన్‌లైన్ పోర్టల్‌లో ముందస్తుగా నమోదు చేసుకోవాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచించారు. తెలంగాణ పోలీస్ అధికారిక పోర్టల్‌లో 2026 గణేష్ విగ్రహాల ఏర్పాటు, ఊరేగింపుకు సంబంధించిన ఆన్‌లైన్ అప్లికేషన్ అందుబాటులో ఉందన్నారు. మండపాల వివరాలు ముందుగానే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండటం ద్వారా ప్రాంతాల వారీగా అవసరమైన పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, నిమజ్జన మార్గాల ప్రణాళిక, భద్రతా చర్యలను సమర్థవంతంగా చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖకు నిర్వాహకులు పూర్తి సహకారం అందించాలని పోలీస్ కమిషనర్ కోరారు.

# భక్తి పేరుతో బీభత్సం!







**నేటి శుభోదయ, రాజేంద్రనగర్:**

భక్తి అంటే పూజలు, భక్తి అంటే అన్నదానం, భక్తి అంటే ఆధ్యాత్మిక చింతన, భక్తి అంటే హిందూ ధర్మం, సంస్కృతి అభివృద్ధికి తోడ్పడటం. కానీ ప్రస్తుతం కొందరు నిర్వాహకుల తీరు చూస్తుంటే భక్తి పేరుతో ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేయడమే లక్ష్యంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గణేశ్ ఉత్సవాల సందర్భంగా ఆగమన్, నిమజ్జనం పేరుతో భారీ బ్యాండ్లు, ప్యాడ్ బ్యాండ్లు, భారీ శబ్దాలతో పాటు కళ్లకు ఇబ్బంది కలిగించే విద్యుత్ దీపాల అలంకరణలు నగరవాసుల సహనానికి పరీక్షగా మారుతున్నాయి. గల్లీల నుంచి ప్రధాన రహదారుల వరకు ఇష్టారాజ్యంగా మండపాలు ఏర్పాటు చేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో కనీసం ఆటోలు వెళ్లేందుకు కూడా ఇబ్బందులు ఏర్పడుతుండగా, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సులు ఎలా వెళ్లాలన్న ప్రశ్న తలెత్తుతోంది. మండపాల ఏర్పాటుతో ప్రజల రాకపోకలకు, వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ, కొందరి ఒత్తిళ్లతో నిబంధనలు పక్కన పెట్టేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో మండపాల ఏర్పాటుకు అనుమతుల విషయంలో నిబంధనలు ఎంతవరకు అమలవుతున్నాయన్నది ప్రశ్నార్థకంగా మారింది.

## డీజేకు పేరు మార్చితే శబ్దం తగ్గుతుందా.?

డీజేలకు అనుమతి లేదనే నిబంధనలను తప్పించుకునేందుకు కొందరు నిర్వాహకులు ప్యాడ్ బ్యాండ్ పేరుతో భారీ శబ్ద పరికరాలను ఉపయోగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెవులు పగిలేంత శబ్దంతో గంటల తరబడి సంగీతాన్ని వినిపించడం వల్ల చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనలు అమలు చేయాల్సిన అధికారులు, పోలీసులు ఇలాంటి వ్యవహారాలపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

## భారీ వెలుగులతో వాహనదారులకు చూపు సమస్యలు

భక్తి పేరుతో భారీగా రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణ చేయడం కూడా కొన్ని ప్రాంతాల్లో వాహనదారులకు ఇబ్బందిగా మారుతోంది. రోడ్ల వైపు నేరుగా విద్యుత్ దీపాలను తిప్పడంతో కళ్లపై తీవ్ర వెలుతురు పడుతుండటంతో ఒక్కసారిగా చూపు మందగించే పరిస్థితులు ఏర్పడుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో ఎదురుగా వచ్చే వాహనాల కాంతితో పాటు మండపాల నుంచి వచ్చే తీవ్ర వెలుతురు కలవడంతో ప్రమాదాల ముప్పు పెరుగుతోందని చెబుతున్నారు.

## భక్తి పేరుతో బల ప్రదర్శన ఎందుకు.?

గణేశ్ ఆగమన్, నిమజ్జనం కార్యక్రమాల పేరుతో భారీగా డబ్బు ఖర్చు చేయడం, భారీ బ్యాండ్లు, భారీ విద్యుత్ దీపాలు, భారీ ఊరేగింపులు నిర్వహించడం భక్తి ప్రదర్శనా.? లేక ఆర్థిక బల ప్రదర్శనా.? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో ఆగమన్, నిమజ్జనం సందర్భంగా కొందరు మద్యం సేవించి చిందులు వేస్తున్నారన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. భక్తి కార్యక్రమాల పేరుతో ఇలాంటి వ్యవహారాలు ఎంతవరకు సమంజసమన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఉత్సవాల కోసం భారీగా ఖర్చు చేస్తున్న నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి.? వాటి నిర్వహణలో పారదర్శకత ఉందా.? అన్న అంశాలపై కూడా సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

## గణేశ్ ఉత్సవాలు గందరగోళానికి వేదిక కాకూడదు

గణేశ్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడాన్ని ఎవరూ వ్యతిరేకించరు. అయితే పండుగ పేరుతో నలుగురికి ఇబ్బందులు కలిగించడం మాత్రం సమర్థనీయం కాదని ప్రజలు అంటున్నారు. ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా, అత్యవసర వాహనాలకు ఎలాంటి ఆటంకం లేకుండా, శబ్ద కాలుష్యానికి తావులేకుండా ఉత్సవాలను నిర్వహించాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందని పేర్కొంటున్నారు. భక్తి అంటే ఇతరులకు ఇబ్బంది కలిగించడం కాదని, తన భక్తితో పాటు సమాజానికి మేలు కలిగించే విధంగా పండుగ జరుపుకోవడమే నిజమైన భక్తి అని ప్రజలు సూచిస్తున్నారు.

## ప్రజల సహనానికి పరీక్ష పెడితే చర్యలు తప్పవు

గణేశ్ ఆగమన్, నిమజ్జనం కార్యక్రమాల సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించే వారిపై అధికారులు, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మండపాల ఏర్పాటులో రహదారులకు ఆటంకం లేకుండా చూడడంతో పాటు అత్యవసర వాహనాలకు ప్రత్యేక మార్గం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనలను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని, రోడ్లపైకి దూసుకొచ్చే ఊరేగింపులను నియంత్రించాలని కోరుతున్నారు. లేకపోతే ప్రతి ఏడాది ఆగమన్, నిమజ్జనం పేరుతో ఇదే గందరగోళం పునరావృతమయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ప్రభుత్వం, పోలీసులపై బాధ్యత

ప్రభుత్వం, పోలీసులు ఇప్పటికైనా స్పష్టమైన నిబంధనలు అమలు చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. భక్తి కార్యక్రమాలకు ఎవరూ అడ్డంకులు సృష్టించకూడదు. అదే సమయంలో భక్తి పేరుతో ప్రజల స్వేచ్ఛకు, రాకపోకలకు, ప్రశాంత జీవనానికి భంగం కలిగించే చర్యలను కూడా అనుమతించకూడదు. గణేశ్ ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికత, సామాజిక సేవకు ప్రతీకగా నిలవాలే తప్ప, రోడ్లపై గందరగోళానికి, శబ్ద కాలుష్యానికి, ప్రజల ఇబ్బందులకు కారణం కాకూడదని నగరవాసులు కోరుతున్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

మండపాల ఏర్పాటు సమయంలో రహదారులను పూర్తిగా మూసివేయకూడదు. అత్యవసర వాహనాలకు ఎల్లప్పుడూ మార్గం ఉండేలా చూడాలి. నిర్ణీత పరిమితికి మించి శబ్దం చేయకూడదు. రోడ్లపైకి నేరుగా కళ్లను మిరుమిట్లు గొలిపే విధంగా విద్యుత్ దీపాలను అమర్చకూడదు. మద్యం సేవించి ఊరేగింపుల్లో హంగామా చేసే వారిపై చర్యలు తీసుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే నిర్వాహకులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

---

# గోదావరి, సాగర్ జలాలను త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించాలి : ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నీటి ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షించాలి
- జిల్లాలో ఎక్కడా త్రాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
- కాలువలు, రెగ్యులేటర్లు, చెరువులకు చేరుతున్న నీటి ప్రవాహంపై నిరంతరం అప్రమత్తం గా ఉండాలి
- పల్లెగూడెం ఎన్ఎస్పి కాలువ పునరుద్ధరణ పనులు, వి.వి. పాలెం డీప్‌కట్ వద్ద జలాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**ఖమ్మం, సెప్టెంబరు 08, నేటి శుభోదయ :**
సాగర్, గోదావరి జలాలను త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యతతో కాపాడుకోవాలని, రైతులు నీటి అవసరమున్న పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మళ్లాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు.మంగళవారం ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పల్లెగూడెం ఎన్ఎస్పీ కాల్వ లింకు కెనాల్ పునరుద్ధరణ పనులను కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సాగర్ జలాల ప్రవాహాన్ని పరిశీలించి, సాగర్ కాలువ నుంచి ఏదులాపురం చెరువుకు నీటి సరఫరా జరిగే కాలువ, తూము మరమ్మత్తు పనుల పై మున్సిపల్ కమిషనర్ సంబంధిత అధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత కాలువ పరిస్థితి, సాగర్ కాలువ నుంచి ఏదులాపురం చెరువు వరకు ఉన్న దూరం, నీటి సాఫీగా ప్రవహించేందుకు అనువైన పరిసితులు తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. సాధ్యమైనంత త్వరితగతిన కాలువ, తూము పునరుద్దరణ పనులను పూర్తిచేయాలని, త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగా సమన్వయంతో చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.అదేవిధంగా ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ మండలం పరిధిలో నిర్వహిస్తున్న ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ పై ఆరా తీశారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఏ ఒక్కరు మిస్ కాకుండా ప్రతి ఒక్కరిని హియరింగ్ కు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలను అందించేందుకు సైతం చర్యలు చేపట్టాలన్నారు.అనంతరం రఘునాథపాలెం మండలం వి. వెంకటాయపాలెం డీప్‌కట్ వద్ద జలాల పరిస్థితిని పరిశీలించారు. అధికారులు, ఇంజినీర్లతో ప్రస్తుత నీటి లభ్యత, త్రాగునీటి సంరక్షణ, వివిధ కాలువలు, రెగ్యులేటర్లు, చెరువులకు చేరుతున్న నీటి ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రస్తుతం సూపర్ ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో గోదావరి, కృష్ణా బేసిన్ పరిధిలో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో గోదావరి, సాగర్ నుంచి తరలిస్తున్న నీటిని త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో ఎక్కడా త్రాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించాలని, త్రాగునీటి అవసరాలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రాధాన్యత క్రమంలో నీటిని వినియోగించాలని అన్నారు. వివిధ కాలువలు, రెగ్యులేటర్లు, చెరువులకు చేరుతున్న నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.నీటి ప్రవాహాల్లో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా కాలువలు, రెగ్యులేటర్లు, అవుట్‌లెట్లను నిరంతరం తనిఖీ చేయాలని, నీటి లభ్యతను బట్టి చెరువులను నింపేందుకు



సమన్వయంతో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో ఇరిగేషన్ సీఈ వాసంతి, ఖమ్మం ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, ఆర్డీవో శ్రీనివాస్, వైరా ఈఈ బాబురావు, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, తహసీల్దార్లు వినయేందర్ రెడ్డి, అరుణ, ఇరిగేషన్ ఏఈ విక్రమ్ తో పాటు పలువురు మున్సిపల్, ఇరిగేషన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

Neti Shubodyaa 09.09.2026_Layout 1 9/9/2026 6:48 AM Page 6



# ఆటో డ్రైవర్ కుమార్తె డాక్టర్‌గా...

## - కష్టాలను అధిగమించి ఎంబీబీఎస్ సీటు సాధించిన షేక్ సనా

**ఖమ్మం, కల్లూరు, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08 :** పేదరికం చదువుకు అడ్డంకి కాదని, పట్టుదలతో లక్ష్యాన్ని సాధించవచ్చని నిరూపించింది ఖమ్మం జిల్లా కల్లూరుకు చెందిన షేక్ సనా. సాధారణ ఆటో డ్రైవర్ కుటుంబం నుంచి వచ్చిన ఆమె నీట్‌లో ప్రతిభ కనబరిచి ఎంబీబీఎస్‌లో సీటు సాధించి స్ఫూర్తిగా నిలిచింది.సనా తండ్రి షేక్ యూసుఫ్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. పరిమిత ఆదాయంతో కుటుంబ అవసరాలను తీర్చుకుంటూనే తన పిల్లల చదువుకు ఎలాంటి లోటు రాకుండా చూసుకున్నారు. తండ్రి పడుతున్న కష్టాన్ని స్ఫూర్తిగా తీసుకున్న సనా వైద్యురాలిగా ఎదగాలనే లక్ష్యంతో కష్టపడి చదివి నీట్‌లో మంచి ప్రతిభ కనబరిచింది.కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం కౌన్సెలింగ్‌లో భాగంగా హైదరాబాద్‌లోని షాదాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో సనాకు ఎంబీబీఎస్ సీటు లభించింది. అయితే వైద్య విద్యకు అవసరమైన భారీ ఫీజులు చెల్లించడం ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థికంగా భారంగా మారింది. ఈ పరిస్థితిని గుర్తించిన షాదాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ మేనేజింగ్ డైరెక్టర్ సారిబ్ రసూల్ ఖాన్ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చారు. సనా ప్రతిభను, ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితిని గుర్తించి ఉచితంగా వైద్య విద్యను అందించేందుకు సహకరించారు.ఈ సందర్భంగా అడ్మిషన్ కమిటీ సభ్యుడు అబ్దుల్ మాజిద్ సనా కుటుం



బానికి ఫీజు రుసుముకు సంబంధించిన చెక్కును అందజేశారు. ఈ సహకారం సనా కుటుంబానికి ఎంతో భరోసానిచ్చింది.పేదరికాన్ని అధిగమించి వైద్య విద్యలో అడుగుపెట్టిన షేక్ సనా ప్రయాణం ఎంతో మంది విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. ప్రతిభ, పట్టుదల, కృషికి తోడు సమాజం నుంచి ప్రోత్సాహం లభిస్తే ఆర్థిక పరిస్థితులు ఎన్ని ప్రతికూలంగా ఉన్నా లక్ష్యాలను సాధించవచ్చని ఆమె విజయం చాటిచెబుతోంది.

# వేంసూరులో బీఆర్ఎస్ పోరుబాట,

## కాంగ్రెస్ ప్రభుత్వంపై సండ్ర వెంకట వీరయ్య ఫైర్






**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 07 :** అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు పై జరిగిన ప్రభుత్వ దాడిని ఖండిస్తూ ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గ వేంసూరు మండలంలో బీఆర్ఎస్ శ్రేణులు భారీ ఆందోళన చేపట్టాయి. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో మర్లపాడు పార్టీ కార్యాలయం నుంచి వేంసూరు వరకు నల్ల జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. మహిళలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నిరసనలకు పిలుపునిచ్చినట్లు కూడా వార్తలు వెలువడ్డాయి. ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ ప్రజా సమస్యలను అసెంబ్లీలో చర్చకు రాకుండా పక్కదారి పట్టించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని విమర్శించారు. బీఆర్ఎస్‌కు తెలంగాణ శాసనసభ, స్పీకర్ పదవి పట్ల పూర్తి గౌరవం ఉందని, స్పీకర్‌ను లేదా శాసనసభను అవమానించడం తమ పార్టీ ఉద్దేశం కాదని స్పష్టం చేశారు.ప్రతిపక్షాలకు ప్రజా సమస్యలపై నిరసన తెలిపే హక్కు ఉందని సండ్ర అన్నారు. పార్లమెంట్‌లో నల్ల దుస్తులతో కాంగ్రెస్ నేతలు నిరసన తెలిపిన సందర్భాలను ప్రస్తావిస్తూ తెలంగాణలో బీఆర్ఎస్ నేతలు నల్ల దుస్తులతో నిరసన తెలిపితే ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనలో బీఆర్ఎస్ నేతలు, మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై ఆయన తీవ్రంగా ఖండించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారన్నది బీఆర్ఎస్ ఆరోపణ కాగా, ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని సండ్ర డిమాండ్ చేశారు.వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో ఇచ్చిన హామీలు అమలు కాలేదని సండ్ర విమర్శించారు. ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ.2,500, ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్, విద్యార్థులకు స్కూటర్లు, కల్యాణలక్ష్మి –షాదీ ముబారక్‌లో తులం బంగారం, పేదలకు ఇళ్లు వంటి హామీలను నెరవేర్చాలని కోరారు.రైతు భరోసా, రైతు బీమా, యూరియా సమస్యలపై కూడా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, దళితులు సహా అన్ని వర్గాల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని అన్నారు.ప్రజా సమస్యలు, హామీల అమలు కోసం బీఆర్ఎస్ పోరాటం ఇక్కడితో ముగియదని మరింత ఉధృతం చేస్తామని సండ్ర వెంకట వీరయ్య స్పష్టం చేశారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా నిరసనకు తరలివచ్చిన మహిళలు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ప్రజా సమస్యలకు సంబంధించిన పలు వినతిపత్రాలను అధికారులకు సమర్పించారు.

# దివ్యాంగులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

## - డీఎల్ఎస్ఏ కార్యదర్శి పి. దేవి మానస

**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08 :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఖమ్మం ఆధ్వర్యంలో ప్రభుత్వ దివ్యాంగ బాలుర వసతి గృహంలో దివ్యాంగుల కోసం న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి పి. దేవి మానస పాల్గొని దివ్యాంగులకు అందుబాటులో ఉన్న చట్టపరమైన హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాల గురించి వివరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగులు స్వావలంబన సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దివ్యాంగజన్ కౌశల్ వికాస్ పథకం ద్వారా నైపుణ్యాభివృద్ధి అవకాశాలను, దివ్యాంగజన్ రోజ్‌గార్ సేతు ద్వారా ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే దివ్యాంగుల హక్కుల చట్టం, 2016 ద్వారా దివ్యాంగులకు కల్పించిన హక్కులు, రక్షణలు, సమాన అవకాశాల గురించి వివరించారు.దివ్యాంగుల విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సామాజిక



భద్రతకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అర్హులైన దివ్యాంగులు తమ హక్కులను తెలుసుకొని సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందాలని సూచించారు. న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని, అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం మరియు న్యాయ సలహా అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎ. ప్రమీల, డీఎల్ఎస్ఏ ప్యానెల్ న్యాయవాదులు, సంబంధిత శాఖ సిబ్బంది మరియు దివ్యాంగులు పాల్గొన్నారు.

# రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తితో గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం కోసం వేగవంతమైన భూముల పరిశీలన పనులు

- ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకై అనువైన భూమికోసం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అన్వేషిస్తున్న ఏ ఏ ఐ సభ్యుల బృందం
- నిన్న సుజాతనగర్ మండల పరిధిలోని సీతంపేటలో పర్యటన
- ఈరోజు దుమ్ముగూడెం మండల పరిధిలోని పెద్ద ఆర్లగూడెం, కమలాపురం, అడివి రామ రం ప్రాంతాల ను పరిశీలించిన ఏ ఏ ఐ బృందం
- కేంద్ర ఏఏ ఐ బృందంతోపాటు పరిశీలనలో పాల్గొన్న రెవెన్యూ, ఫారెస్ట్, ఇరిగేషన్ మైనింగ్ శాఖా అధికారులు
- ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్న మంత్రి తుమ్మల



**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08 :** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు గత వారం క్రితం తెలంగాణ, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రయోజనాల కై కేంద్ర వ్యవసాయ, రైల్వే,పట్టణ అభివృద్ధి,సకల మంత్రులతో పాటు కేంద్ర విమాన యాన శాఖామంత్రి రామ్మోహన్ నాయుడు తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ప్రధానంగా దక్షిణ అయోధ్యగా పేరు గాంచిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రామాలయ పుణ్యక్షేత్రానికి విమాన సౌకర్యం కల్పించాలని దాని ఆవశ్యకతను, అవసరాన్ని రామ్మోహన్ నాయుడు కి విజ్ఞప్తి చేశారు. మంత్రి తుమ్మల విజ్ఞప్తి మేరకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఆదేశాలతో కేంద్ర ఏ ఏ ఐ బృందం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటిస్తున్నది. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటు చేయాలని పట్టుదలతో ఉండటం, కేంద్ర అధికారుల బృందం పర్యటిస్తున్నట్టంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు మంత్రి తుమ్మల పై ప్రశంసలు కురిపిస్తున్నారు. హైదరాబాదులో ఉన్న మంత్రి తుమ్మల చరవాణి ద్వారా కేంద్ర బృంద పర్యటనపై ఆ జిల్లా ఉన్నత అధికారులతో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

# తాగునీటి సమస్యను పరిష్కరించాలి - సలాం



**వికారాబాద్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08 :** త్రీ టౌన్ ప్రాంతంలో సీపీఐ త్రీ టౌన్ కార్యదర్శి నూనె శశిధర్ ఇంటి వద్ద సీపీఐ ముఖ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సలాం మాట్లాడుతూ త్రీ టౌన్ ప్రాంతంలో మంచినీళ్లు రాక వారం రోజులు కావొస్తున్నా పట్టించుకునే వారే లేరని, కార్పొరేటర్ల పదవి కాలం ముగియడం తో స్పెషల్ ఆఫీసర్ పరిపాలన లో సమస్యను పరిష్కరించి ప్రజలకు మంచి నీటి సౌకర్యాన్ని కూడా అందిచలేక పోతున్న వైనం త్రీ టౌన్ ప్రాంతంలో ఏర్పడింది. వెంటనే మంచి నీటి సమస్యను పరిష్కరించి సత్వరమే ప్రాంత ప్రజలకు మంచి నీటిని అందిచలేకపోతే కార్పొరేషన్ కమిషనర్ ఇంటిని ముట్టడి చేస్తామని సలాం అన్నారు. త్రీ టౌన్ కార్యదర్శి నూనె శశిధర్ మాట్లాడుతూ వర్షం వచ్చి న ప్రతి సారి పొట్టి శ్రీరాములు రోడ్ లో, కాలవొడ్డు శివాలయం నుంచి అగ్రికల్చర్ మార్కెట్ మధ్య గల ప్రధాన రహదారి నడుము లోతు మురికి నీళ్ళతో నిండి రాక పోకలకు తీవ్రమైన ఆటంకం ఎదురవు తున్నప్పటికి కార్పొరేషన్ అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదని పూర్తిగా వైఫల్యం చెందారని, నూనె శశిధర్ అన్నారు. ఈ కార్యక్రమంలో త్రీ టౌన్ సహాయ కార్యదర్శులు భుక్య రవీందర్, నామా విజయ్ కుమార్, ఎర్ర ఉపేందర్, నిమ్మల శ్రీను, ఆకుల రమేష్, దామళ్ళ రాము, నూనె నందు తదితరులు పాల్గొన్నారు.

# శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న 400 బుల్లెట్ సైలెన్సర్ల ధ్వంసం

## - అడిషనల్ డీసీపీ రామానుజం



**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08 :** శబ్ద కాలుష్యాన్ని సృష్టిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న బుల్లెట్ ద్విచక్ర వాహనాల సైలెన్సర్లపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటున్నట్లు అడిషనల్ డీసీపీ రామానుజం తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అమర్చిన, అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకున్న బుల్లెట్ సైలెన్సర్లను పోలీస్ హెడ్ క్వాటర్స్ లో రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. వాహనదారులు తమ ద్విచక్ర వాహనాలకు కంపెనీ నిర్దేశించిన ఒరిజినల్ సైలెన్సర్లనే వినియోగించాలని, అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను అమర్చుకుని ప్రజలకు అసౌకర్యం కలిగించవద్దని సూచించారు.ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా అధిక శబ్దంతో వాహనాలు నడపడం, నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్లను మార్చడం వంటి చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.ప్రజల ప్రశాంతత, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని శబ్ద కాలుష్య నియంత్రణకు పోలీసుల చర్యలు కొనసాగుతాయని ఈ సందర్భంగా తెలిపారు.గతంలో 1654 బుల్లెట్ సైలెన్సర్లను తొలగించి ధ్వంసం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, ఏఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

Neti Shubodyaa 09.09.2026_Layout 1 9/9/2026 6:48 AM Page 7



## మహిళా అధికారులకు ప్రవక్త మహమ్మద్ జీవిత చరిత్ర పుస్తకాల అందజేత



**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08 :** జమాతే ఇస్లామీ హింద్ ఖమ్మం నగర శాఖ ఆధ్వర్యంలో ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర, ఆయన బోధనలు, మానవతా విలువలను పరిచయం చేసే పుస్తకాలను కలెక్టర్ కార్యాలయంలోని మహిళా అధికారులైన జాయింట్ డైరెక్టర్ బ్యాక్‌వర్డ్ క్లాస్ డెవలప్‌మెంట్ జ్యోతి, హార్టికల్చర్ అండ్ సిరికల్చర్ జాయింట్ డైరెక్టర్ అనసూయ, జిల్లా వెల్ఫేర్ అధికారి ప్రమీల, ఎంప్లాయ్‌మెంట్ అధికారి మాధవి, డీఆర్వో సూపరింటెండెంట్ సాదియా , సివిల్ సప్లై అధికారి సృజన, ఉమెన్స్ హబ్ కోఆర్డినేటర్ సమ్రీన్ ఇతర మహిళా అధికారులకు పుస్తకాలను అందజేశారు.స్వామి లక్ష్మీ శంకరాచార్య రచించిన మహమ్మద్ ప్రవక్త (సఅసం) చూపిన జీవన ప్రబోధనలు, కేవీస్ రామకృష్ణారావు రచించిన ఇస్లాం ప్రవక్త మహమ్మద్ (సఅసం), యస్.ఎమ్. మలిక్ రచించిన ఆదర్శమూర్తి మహమ్మద్ (సఅసం) తదితర పుస్తకాలను జమాతే ఇస్లామీ హింద్ ఖమ్మం నగర శాఖ అధ్యక్షురాలు అస్మా అంజుమ్, నగర పీఆర్ కన్వీనర్ హాజీరా సదఫ్, సెంట్రల్ శాఖ అధ్యక్షురాలు అస్ఫియా అంజుమ్, పీఆర్ సభ్యులు ఫైజా ఇరం, సబిహా కలిసి అధికారులకు అందజేశారు.ఈ సందర్భంగా నగర శాఖ అధ్యక్షురాలు అస్మా అంజుమ్ మాట్లాడుతూ ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అనాథలు, పేదలు, బలహీనులు, అవసరంలో ఉన్నవారి పట్ల దయ, కరుణ చూపాలని బోధించారని తెలిపారు. పొరుగువారి హక్కులను గౌరవించడం, వారి హక్కులను పరిరక్షించడం, సమాజంలో పరస్పర ప్రేమ, సోదరభావం, సహకారాన్ని పెంపొందించడం వంటి విలువలకు ఆయన ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు.నగర పీఆర్ కన్వీనర్ హాజీరా సదఫ్ మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలో అత్యంత ప్రభావశీలులైన వ్యక్తులపై మైఖేల్ హెచ్. హార్ట్ రచించిన ది 100: ఎ ర్యాంకింగ్ ఆఫ్ ది మోస్ట్ ఇనఫ్లుయ◌ెన్షియల్ పర్సన్స్ ఇన్ హిస్టరీ పుస్తకంలో ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంకు ప్రథమ స్థానం కల్పించారని తెలిపారు. ప్రవక్త బోధనలు, ఆయన చూపిన మార్గం ప్రపంచ చరిత్రపై చూపిన ప్రభావాన్ని ఇది తెలియజేస్తుందని అన్నారు.సెంట్రల్ శాఖ అధ్యక్షురాలు అస్ఫియా అంజుమ్ ప్రజల మాట్లాడుతూ పట్ల జాలి, కరుణ, ఆదరణతో వ్యవహరించాలని, మాటల ద్వారా గానీ, చేతల ద్వారా గానీ ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా జీవించాలని ప్రవక్త మహమ్మద్ బోధించారని ఆమె తెలిపారు. దయ, న్యాయం, సోదరభావం, పరస్పర గౌరవం వంటి మానవతా విలువలు సమాజంలో శాంతి, సామరస్యాన్ని పెంపొందించేందుకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవితాన్ని, ఆయన బోధించిన మానవతా విలువలను సమాజంలోని వివిధ వర్గాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ పుస్తకాలను అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఎల్ఐసీ ఖమ్మం శాఖలో ఘనంగా 70వ బీమా వారోత్సవాలు

- ఎల్ఐసీ ఖమ్మం శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు, విజేతలకు బహుమతుల ప్రదానం



**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08 :** భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) ఖమ్మం శాఖలో సెప్టెంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించిన 70వ బీమా వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. వారోత్సవాల సందర్భంగా ఉద్యోగులు, ఏజెంట్లు, అభివృద్ధి అధికారులు, వినియోగదారులను భాగస్వాములను చేస్తూ పలు కార్యక్రమాలను నిర్వహించారు.సెప్టెంబర్ 1న జ్యోతి ప్రజ్వలనతో బీమా వారోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. అనంతరం సెప్టెంబర్ 2న ఏజెంట్ల దినోత్సవాన్ని, సెప్టెంబర్ 3న అభివృద్ధి అధికారుల దినోత్సవాన్ని నిర్వహించారు. వారోత్సవాల్లో భాగంగా ఉద్యోగులకు వివిధ ఉల్లాసభరితమైన కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించారు. ముగింపు వేడుకల్లో ఆయా పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు.వారోత్సవాల ముగింపు సందర్భంగా సెప్టెంబర్ 7న రాపర్తి నగర్‌లోని మదర్ థెరిస్సా మానసిక వికలాంగుల కేంద్రంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ సిబ్బంది సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ఎల్ఐసీ ఖమ్మం శాఖ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ బాలాజీ నాయక్ అధ్యక్షత వహించారు. ఖమ్మం జిల్లా సీనియర్ సలహాదారు తేజావత్ నరసింహారావు, బానోత్ శ్రీనివాసరావు, ఏడీఎం జె. హేమావతి, శరత్ చంద్ర, రోహన్ రెడ్డి, సుధీర్ కుమార్, మంగ, ఎన్. వనిత తదితరులు, వివిధ యూనియన్ ప్రతినిధులు, ఎల్ఐసీ సిబ్బంది, వినియోగదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## బాల్య వివాహాల నివారణపై ప్రత్యేక దృష్టి : పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08 :** బాల్య వివాహాలను అరికట్టేందుకు పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించిందని, బాల్య వివాహాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. బాల్య వివాహాల వల్ల బాలల భవిష్యత్తు, విద్య, ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉన్నందున, ఇటువంటి వివాహాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించరాదని పోలీస్ కమీషనర్ తెలిపారు.బాల్య వివాహాలకు పాల్పడే వారు, ప్రోత్సహించే వారు, సహకరించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాలపై సమాచారం అందిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల కూసుమంచి బోటిమీడి తండా, తల్లాడ మండలం అన్నారుగూడెం,వైరా మండలం తాటిపూడి, సత్తుపల్లి బేతుపల్లి, కామేపల్లి మండలం బాసిత్ నగర్, బోనకల్ మండలం పెద్దబీరవల్లి, వైరా మండలం, గన్నవటం. ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం ఎనిమిది బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు సకాలంలో జోక్యం చేసుకుని వివాహాలను నిలిపివేశారని తెలిపారు. అదేవిదంగా 12 కేసులు నమోదు అయినట్లు పేర్కొన్నారు. బాల్య వివాహాల నివారణకు తల్లిదండ్రులు, ప్రజలు, ఉపాధ్యాయులు మరియు సంబంధిత శాఖల అధికారులు పోలీస్ శాఖకు సహకరించాలని పోలీస్ కమిషనర్ కోరారు.

## జిల్లా పోలీసు శాఖ సోషల్ మీడియా హ్యాండ్లర్ల పనితీరును సమీక్షించిన ఎస్పీ రోహిత్ రాజు



**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08 :** జిల్లాలో సోషల్ మీడియా వేదికల ద్వారా జరుగుతున్న కార్యకలాపాల గురించి వాటిని పర్యవేక్షిస్తున్న సంబంధిత పోలీసు అధికారులతో మంగళవారం నాడు జిల్లా ఎస్పీ కార్యాలయం నందు ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ సమీక్షించారు. సోషల్ మీడియా ద్వారా ప్రజలను ప్రభావితం చేసే హ్యాండ్లర్లు, వారు ప్రచారం చేస్తున్న పోస్టులు, వీడియోలు, సందేశాలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సోషల్ మీడియాలో రాజకీయ, మతపరమైన, కమ్యూనల్ అంశాలపై ప్రజలను రెచ్చగొట్టే విధంగా పోస్టులు, వీడియోలు, సందేశాలు ప్రచారం చేసే వారిపై పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తారని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా లేదా ప్రజల్లో విద్వేషాలను రెచ్చగొట్టేలా ఉన్న పోస్టులను గుర్తించి, వాటిని తొలగించే చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.అలాంటి పోస్టులు చేసే వ్యక్తులతో పాటు వాటిని ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేసే హ్యాండ్లర్లపై నిరంతరం నిఘా కొనసాగిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, నిర్ధారణ లేని సమాచారాన్ని ప్రచారం చేయడం, ప్రజలను రెచ్చగొట్టే పోస్టులను షేర్ చేయడం, ఫార్వర్డ్ చేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్బి ఇన్స్పెక్టర్ ఇ.శ్రీనివాస్, ఎస్సై చంద్రశేఖర్ , పోలీసు శాఖ సోషల్ మీడియా హ్యాండ్లర్స్ పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాల్లో నిబంధనలు తప్పనిసరి, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు - జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**ఖమ్మం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08 :** ప్రజలందరూ గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో, శాంతియుత ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. ఉత్సవాల సందర్భంగా ప్రజల భద్రత, శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.గణేష్ మండపాల నిర్వాహకులు మండపం ఏర్పాటు చేయడానికి ముందుగానే పోలీసులకు సమాచారం అందించడంతో పాటు పోలీసు శాఖ రూపొందించిన ఆన్‌లైన్ పోర్టల్‌లో మండపానికి సంబంధించిన వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా భద్రత, బందోబస్తు ఏర్పాట్లకు ఈ వివరాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

**-- గణేష్ మండపాల ఆన్‌లైన్ నమోదు పోర్టల్**

http://policeportal.tspolice.gov.in/index.htm

ఆన్‌లైన్‌లో మండప వివరాలను నమోదు చేసి, అనంతరం దరఖాస్తు వివరాలను సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అందజేయాలని సూచించారు. మండపాలను ప్రధాన రహదారులు, ప్రజా రవాణా మార్గాలు, అత్యవసర వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగించే విధంగా ఏర్పాటు చేయరాదన్నారు. విద్యుత్ శాఖ అనుమతులతోనే విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలని సూచించారు.మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, 24 గంటలు వాలంటీర్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. గణేష్ మండపాలకు జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు.ఉత్సవాల సందర్భంగా డీజేలకు ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు. పోలీసుల అనుమతితో నిబంధనలకు లోబడి పరిమిత శబ్దంతో స్పీకర్లు మాత్రమే వినియోగించాలని, రాత్రి 10 గంటల తర్వాత లౌడ్‌స్పీకర్లు వినియోగించరాదని తెలిపారు. చిన్నారులు, వృద్ధులు తదితరులకు ఇబ్బంది కలిగించే విధంగా పరిమితికి మించి శబ్దాలు వినియోగించరాదన్నారు.నిమజ్జనం సందర్భంగా పోలీసుల సూచనలు, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. నిర్ణీత సమయాల్లోనే నిమజ్జన శోభాయాత్ర నిర్వహిస్తూ ప్రజలు, ఇతర వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు. శోభాయాత్రలో టపాసులు పేల్చడం, డీజేలు ఏర్పాటు చేయడం నిషేధమని తెలిపారు.శోభాయాత్రలో పాల్గొనే వారు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించే విధంగా వాహనాలను రహదారులపై నిలిపివేయరాదని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో పోలీసుల సూచనలను పాటిస్తూ సహకరించాలని కోరారు.గణేష్ ఉత్సవాల సందర్భంగా రౌడీషీటర్లు, సస్పెక్ట్‌లు, సమస్యాత్మక వ్యక్తులపై పోలీసుల నిరంతర నిఘా ఉంటుందని ఎస్పీ తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ప్రజలకు అనుమానాస్పదంగా ఎవరైనా వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తూ పోలీసు శాఖకు ప్రజలు, మండపాల నిర్వాహకులు సంపూర్ణ సహకారం అందించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

Neti Shubodyaa 09.09.2026_Layout 1 9/9/2026 6:48 AM Page 8



# ఎయిమ్స్ లో అత్యాధునిక వైద్య సేవలు

## బీబీ నగర్లో ఎయిమ్స్ ను పరిశీలించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్

**నిజామాబాద్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08 :** కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎయిమ్స్ లో అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ తెలిపారు.భువనగిరి జిల్లా బీబీ నగర్లో గల ఎయిమ్స్ ( ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్) ను మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....ప్రైవేటు ఆసుపత్రులకు ధీటుగా వైద్య సేవలు అందుతున్నాయన్నారు.మొత్తం 750 బెడ్ లతో నిర్మిస్తున్న ఎయిమ్స్ లో ప్రస్తుతం 260 అందుబాటులో ఉన్నాయన్నారు.మరో ఆరు నెలల్లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందన్నారు.ప్రధానంగా కేవలం పది రూపాయల ఫీజుతో ఏడాదిపాటు ఓపీ పొందవచ్చన్నారు.అలాగే ఇన్ పేషెంట్ గా అడ్మిట్ అయితే ఒకరోజుకు బెడ్ ఛార్జీ కేవలం రూ.35 తీసుకుంటారన్నారు.కావున పేద మధ్య తరగతి కుటుంబాల వారు వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు.ప్రస్తుతం 25 ప్రధాన విభాగాల్లో వైద్యులు,సిబ్బంది అందుబాటులో ఉన్నారని పేర్కొన్నారు. దీర్ఘ కాలిక వ్యాధులు,అత్య



వసర వైద్యం కావలసిన వారు ఎయిమ్స్ లో చికిత్స పొందాలన్నారు.అవసరమైన వారు తమను సంప్రదిస్తే రిఫర్ చేస్తామని తెలిపారు.

# ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**- కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కోరిన బీజేపీ అధికార ప్రతినిధి కప్పర ప్రసాద్ రావు**



**గజ్వేల్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08 :** రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న శక్తులపై కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ అధికార ప్రతినిధి కప్పర ప్రసాద్ రావు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కోరారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్‌ను పార్టీ కార్యాలయంలో కలిసి రాష్ట్రంలోని తాజా పరిస్థితులను వివరించారు. ప్రజల హక్కులను కాలరాస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే విధానాలను అనుసరిస్తున్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కప్పర ప్రసాద్ రావు విజ్ఞప్తిపై బండి సంజయ్ కుమార్ సానుకూలంగా స్పందిస్తూ, ఈ అంశాన్ని కేంద్ర హోం శాఖ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అవసరమైన చర్యల కోసం హోం శాఖను ఆదేశిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రజల హక్కులు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ చట్టబద్ధంగా పోరాటం చేయాలని కప్పర ప్రసాద్ రావు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిరంతరం పోరాటాలు కొనసాగించాలని ఆయన కోరారు.

# వెల్జాల్‌లో కనుల పండుగగా ఇదమ్మ తల్లి బోనాలు

- అంగరంగ వైభవంగా బోనాల సమర్పణ
- సర్పంచ్ వానరాశి రాములమ్మ
- మాజీ ఎంపిపి సిఎల్ శ్రీనివాస్ యాదవ్



**తలకొండపల్లి, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08 :** మండలంలోని వెల్జాల్ గ్రామంలో ఇదమ్మ తల్లి బోనాల పండుగను గ్రామ ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు.సర్పంచ్ వానరాశి రాములమ్మ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రతి వాడ నుంచి భక్తులు బండ్ల బోనాలతో తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు.డప్పు వాయిద్యాలు, డమరుకాల మోతలు, పోతురాజుల విన్యాసాలు, గ్రామ యువకుల ఉత్సాహంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించడంతో గ్రామం భక్తులతో కిక్కిరిసింది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాస్ యాదవ్ హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెల్జాల్ గ్రామంలో ఈసారి ఇదమ్మ తల్లి బోనాల పండుగ ఎంతో అద్భుతంగా, భక్తిభావంతో నిర్వహించడం అభినందనీయమన్నారు.గ్రామ సర్పంచ్ రాములమ్మతో పాటు బోనాల నిర్వహణకు సహకరించిన గ్రామ పెద్దలు, యువకులను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శివ విజయలక్ష్మి విజయ్ కుమార్, గ్రామ పెద్దలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ఉపసర్పంచ్, మాజీ వార్డు సభ్యులు, గ్రామ యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**- టీజీఇ జేఏసీ పిలుపు**



**వనస్థలిపురం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08 :** వనస్థలిపురంలోని సీనియర్ సిటిజన్ కమిటీ హాల్ లో జరిగినటువంటి టీజీఇ జేఏసీ పిలుపు మేరకు ఉద్యోగ, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్రస్థాయి సమావేశం డిమాండ్ చేసింది. ఎం. మోహన్ నారాయణ, ఎస్. నరసరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, ఐదు డీఏలు విడుదల చేయాలని కోరారు.జీతాల నుంచి 1.5 శాతం మినహాయిస్తున్నప్పటికీ ఉద్యోగులకు హెల్త్ కార్డులు అందకపోవడం, ఆసుపత్రుల్లో సరైన వైద్య సేవలు అందకపోవడంతో ఉద్యోగులు, పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, పెన్షన్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా సెప్టెంబర్ 10న 'చలో హైదరాబాద్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చలో హైదరాబాద్ గోడపత్రికను విడుదల చేసి, ప్రభుత్వం సమస్యల పరిష్కారంపై లిఖితపూర్వక హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జె. రవీందర్, యాదయ్యగౌడ్, విశ్వనాథ్, కూర్మారావు, అప్పారావు, కృష్ణమూర్తి, బాలకృష్ణ, లక్ష్మీనారాయణ, బసవయ్య, సాంబశివరావు, సుధాకర్, పీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది

**- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**



**మంథని, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08 :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల విఫల పాలన లో అమలు చేయని 420 హామీలు, 6 గ్యారంటీల పై బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని కి వినతి పత్రం అందజేసి మరియు మహిళా ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డిలపై అనుచితంగా ప్రవర్తించిన పోలీసుల తీరును ఖండిస్తూ నిరసన కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా భీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణి, పెదపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్ లతో కలిసి పాల్గొని అనంతరం అయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిందని విమర్శించారు.ఆడబిడ్డల వివాహాల కోసం కల్యాణలక్ష్మి తో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించారని అన్నారు. విద్యార్థుల పైచదువుల కోసం రూ.5 లక్షల ఏటీఎం కార్డులు ఇస్తామని చెప్పిన హామీని కూడా అమలు చేయలేదన్నారు.మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి రాష్ట ప్రజలను, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలను ఉపయోగించుకుని మోసం చేశారన్నారు.యువతకు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు ఆ హామీ అమలుకు నోచుకోలేదని అన్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్నప్పటికీ పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాలకు కొత్త పరిశ్రమలు తీసుకురావడంలో, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో విఫలమయ్యారన్నారు.పెద్దపల్లి పట్టణం మధ్యలో బస్సు డిపో నిర్మించడం వల్ల ప్రజలకు శబ్ద కాలుష్యంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, బస్సు డిపోను పట్టణానికి బయట ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.బస్టాండ్ సమీపంలోని ప్రాంతాన్ని ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలని, అక్కడ ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు లేదా జిల్లా కోర్టు ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశామని తెలిపారు. కల్యాణలక్ష్మి , షాదీ ముబారక్, పింఛన్లను రూ.1,000 నుంచి రూ.2,000కు పెంచడం, రోడ్ల నిర్మాణం, చెరువుల అభివృద్ధి వంటి అనేక కార్యక్రమాలను చేపట్టామన్నారు,కాల్వశ్రీరాంపూర్‌లో సుమారు 950 ఇళ్ల నిర్మాణం, పెద్దపల్లిలో ఇళ్ల నిర్మాణంతో పాటు దాసరి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో అద్భుతమైన కలెక్టరేట్ కార్యాలయ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు,కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా బీఆర్ఎస్ నాయకులు వెనక్కి తగ్గబోరని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజల తరపున, మహిళల తరపున నిరంతరం పోరాడుతూనే ఉంటారని స్పష్టం చేశారు.

# మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని పరామర్శించిన కాటేదాన్ బిఆర్ఎస్ నాయకులు

**రాజేంద్రనగర్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08 :** మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై నిన్న జరిగిన అనుహ్య సంఘటన నేపథ్యంలో మంగళవారం ఉదయం కాటేదాన్ డివిజన్



అధ్యక్షులు ఎస్ వెంకటేష్ నాయకత్వంలో పలువురు నాయకులు ఆమెను నివాసంలో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్ వెంకటేష్ తో పాటు నాయకులు సుభాష్ రెడ్డి, రమేష్ ముదిరాజ్, రాము యాదవ్ తదితరులు సబితమ్మను కలిసి నిన్న చోటుచేసుకున్న సంఘటనకు సంబంధించిన వాతావరణం, వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమెకు ధైర్యం చెప్పి పరామర్శించారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

Neti Shubodyaa 09.09.2026_Layout 1 9/9/2026 6:48 AM Page 9



## ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై వ్యాపారులకు అవగాహన

**పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి...మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్**



**మంథని, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08 :** ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా నివారించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్ కోరారు. మంథని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం పట్టణ వ్యాపారులకు ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వినియోగంతో పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతుందని తెలిపారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పర్యావరణహిత వస్తువులను వినియోగించాలని వ్యాపారులకు సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించడంలో వ్యాపారులు, ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు పెంటరి రాజు, ఎల్లంకి వంశీధర్, మున్సిపల్ సిబ్బంది, పట్టణ వ్యాపారులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా విద్యార్థుల పదవీ ప్రమాణోత్సవం.



**భద్రాద్రి కొత్తగూడెం, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08 :** భద్రాచలం పట్టణంలోని చర్ల రోడ్డులో గల శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థుల క్యాబినెట్ ఎన్నికలు నిర్వహించి, అనంతరం పదవీ ప్రమాణోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన క్యాబినెట్ ఎన్నికల్లో వివిధ హోదాలకు ఎంపికైన విద్యార్థులకు వారి పదవులను అధికారికంగా అందజేశారు.ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులకు బాధ్యతలు, నాయకత్వ లక్షణాలు, పాఠశాల పట్ల వారి కర్తవ్యాలను వివరించారు. విద్యార్థులతో ప్రమాణ స్వీకారం చేయించి, వారికి నాయకత్వ బాధ్యతలను అప్పగించారు.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బి. గోపాల్, స్కూల్ ఏజీఎం వీరన్న, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ బి. గోపాల్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడమే పాఠశాల క్యాబినెట్ వ్యవస్థ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు తమకు అప్పగించిన బాధ్యతలను క్రమశిక్షణతో, నిజాయితీగా నిర్వర్తించాలని సూచించారు.

## గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి : కేశంపేట పోలీసులు




**కేశంపేట, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08 :** కేశంపేట పోలీస్‌స్టేషన్‌లో గణేష్ ఉత్సవాల సందర్భంగా శాంతి కమిటీ సమావేశాన్ని ఇన్‌స్పెక్టర్ బి. నరహరి, ఎస్ఐ బి. పరమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కేశంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని వర్గాల కమ్యూనిటీ పెద్దలు, గణేష్ ఉత్సవ నిర్వాహకులు, ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. గణేష్ విగ్రహాల ప్రతిష్ఠాపన, ఉత్సవాల నిర్వహణ, నిమజ్జనం సందర్భంగా శాంతిభద్రతలు, మత సామరస్యాన్ని కాపాడే అంశాలపై పోలీసులు పలు సూచనలు చేశారు.అనుమతులు పొందిన, నిర్ణయించిన ప్రదేశాల్లోనే గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఉత్సవాలు, ఊరేగింపులు నిర్ణీత సమయాలు, మార్గాల్లోనే నిర్వహించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రెచ్చగొట్టే పాటలు, ప్రసంగాలు, నినాదాలు, బ్యానర్లు లేదా ఇతర కార్యక్రమాలతో సామాజిక ఉద్రిక్తతలకు అవకాశం కల్పించరాదని హెచ్చరించారు. నిమజ్జనం సమయంలో పోలీసుల సూచనలు పాటిస్తూ నిర్ణీత మార్గాలు, నిమజ్జన ప్రదేశాలను మాత్రమే వినియోగించాలని తెలిపారు.మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, ట్రిపుల్ రైడింగ్ వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. పుకార్లు, వివాదాలు లేదా శాంతిభద్రతలకు భంగం కలిగించే ప్రయత్నాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని కమిటీ సభ్యులు హామీ ఇచ్చారు.

# 35లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

**ఇల్లందు, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08 :** టేకులపల్లి మండలం పెగల్లపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని తూర్పుగూడెం గ్రామంలో ₹35 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య శంకుస్థాపన చేశారు. హారతులతో ఘన స్వాగతం పలికిన ఆడబిడ్డలు.ఈ సందర్భంగా గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్, మండల అధ్యక్షులు లక్కినేని శ్యామ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాలే ప్రసాద్, పెగల్లపాడు సర్పంచ్ కోరం హనుమంతు, గ్రామ శాఖ అధ్యక్షులు లక్కినేని మురళీ,ఉపాధ్యక్షులు హనుమంతురావు, భద్రు,



కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేపాల్ వరదల్లో గల్లంతైన మణికొండ వాసి ధన్పాల్ రెడ్డి, బాధిత టుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08 :** మణికొండకు చెందిన ధన్పాల్ రెడ్డి అనే వ్యక్తి నేపాల్ యాత్రకు వెళ్లి, ఇటీవల అక్కడ సంభవించిన వరద ప్రమాదంలో గల్లంతైన విషయం విదితమే. ప్రమాదం జరిగి రోజులు గడుస్తున్నా నేటికీ ఆయన ఆచూకీ తెలియకపోవడంతో ధన్పాల్ రెడ్డి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఈ దుర్ఘటన గురించి తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మణికొండలోని ధన్పాల్ రెడ్డి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చి, వారికి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, ధన్పాల్ రెడ్డి ఆచూకీ కనుగొనేందుకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలా కృషి చేస్తామని బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ, నేపాల్ అధికారుల సమన్వయంతో గాలింపు చర్యలు మరింత వేగవంతం అయ్యేలా ప్రభుత్వానికి తగిన సిఫారసు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కష్టకాలంలో కుటుంబానికి



అండగా ఉంటామని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యే తో పాటు గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ ముదిరాజ్, మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, నార్సింగి మార్కెట్ చైర్మన్ వేణు గౌడ్, మణికొండ సర్కిల్ పార్టీ అధ్యక్షుడు శ్రీరామ్, కుమార్, శ్రవణ్ తదితరులు ఉన్నారు.

## సీఎం ప్రకటించిన కనీస వేతనాలైనా కేజీబీవీల్లో అమలు చేయాలి

**- యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్**

**నిజామాబాద్, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08 :** తెలంగాణ రాష్ట్రంలోని కేజీబీవీలో పనిచేస్తున్న నాన్ టీచింగ్,వర్కర్ల వేతనాల పెంపు ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 11న ఛలో హైదరాబాద్ ప్రచార కరపత్రాలను మాక్లూర్ కేజీబీవీలో ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ....కేజీబీవీ నాన్ టీచింగ్,వర్కర్లకు ఏళ్లుగా వేతనాలు పెరగలేదని,పైగా పని భారం పెరిగిందన్నారు.సమస్యలు పరిష్కరించమని విన్నవిస్తే,అదనంగా నైట్ డ్యూటీలు వేశారని ఆరోపించారు.కేజీబీవీ ల పట్ల గత ప్రభుత్వం కంటే కక్షపూరితంగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.మూడేళ్లుగా అధికారులను ప్రభుత్వాన్ని ప్రజాప్రతినిధులను కలిసి విన్నవిస్తూనే ఉన్నామని,ఇక పోరాటం తప్ప మరోమార్గం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి ప్రకటించిన కనీస వేతనాలనైనా తక్షణమే అమలు చేయాలన్నారు.అకౌంటెంట్వర్కర్లకు నిబంధనలకు,జాబ్ చార్ట్ కు భిన్నంగా ఇటీవల కేటాయించిన నైట్ డ్యూటీలను రద్దు చేయాలన్నారు.వారానికి ఒకరోజు సెలవు చొప్పున వర్కర్లకు వీక్లీఆఫ్ అమలు చేయాలన్నారు. ఖాళీ పోస్టులు భర్తీచేసి పనిభారం తగ్గించాలన్నారు.ప్రభుత్వ ఉద్యోగాల్లో అర్హతలు ఉన్న నాన్ టీచింగ్ సిబ్బందికి వెయిటేజీ ఇవ్వాలన్నారు.రిటైర్మెంట్ వయసును 65 సంవత్సరాలకు పెంచాలని,రి



టైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు.పీఎఫ్ ఈఎస్ఐ అమలు చేసి ఉద్యోగ,ఆరోగ్యభద్రత కల్పించాలన్నారు.ఈనెల 11న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని కేజీబీవీల నాన్ టీచింగ్,వర్కర్లు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.కేజీబీవీ వర్కర్ విజయమ్మ మాట్లాడు తూ.... ప్రభుత్వం మాతో వెట్టిచాకిరి చేయిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఖాళీ పోస్టులు భర్తీ చేసి,పని భారాన్ని తగ్గించాలన్నారు.పనికి తగ్గ జీతం ఇవ్వాలని ప్రభుత్వానికి అధికారులకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది మోతి, రమ, శారద, సువర్ణ, శారదమ్మ, ఆండాలు, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్ ఆత్మగౌరవంపై దాడిని ఖండిస్తున్నాం.. కేశంపేట కాంగ్రెస్ అధ్యక్షుడు అనుమగళ్ల రమేష్

**కేశంపేట, నేటి శుభోదయ, సెప్టెంబర్ 08 :**
తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను లక్ష్యంగా చేసుకుని ఎమ్మెల్సీలు తాత మధు, నవీన్ రెడ్డి చేసినట్లు పేర్కొన్న అనుచిత, అవమానకర వ్యాఖ్యలపై కేశంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనుమగల్ల రమేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ విమర్శలకు హద్దులు ఉండాలని, రాజకీయ విభేదాల పేరుతో వ్యక్తిగత దూషణలకు దిగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు.రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్‌ను అవమానించేలా మాట్లాడటం కేవలం ఒక వ్యక్తిని కించపరచడం కాదని, ప్రజాస్వామ్య వ్యవస్థలు, రాజ్యాంగ సంస్థల గౌరవాన్ని దెబ్బతీసే చర్యగా భావించాల్సి ఉంటుందని రమేష్ పేర్కొన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆత్మగౌరవాన్ని కించపరిచే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు.ప్రజాప్రతినిధులుగా బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వారు తమ హోదాకు తగిన విధంగా సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. ప్రజాస్వామ్య



సంస్థలను గౌరవించడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని అన్నారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై సంబంధిత అధికారులు, పార్టీ నాయకత్వం తగిన చర్యలు తీసుకోవాలని అనుమగల్ల రమేష్ డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలు ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ఎల్లప్పుడూ ముందుంటారని ఆయన తెలిపారు.

# మహిళా ఎమ్మెల్యేలపై దాడి హేయం
## ప్రభుత్వం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి




**నిజామాబాద్ రూరల్ డిచ్ పల్లి నేటి శుభోదయ ప్రతినిధి సెప్టెంబర్ 08 :** నిజామాబాద్ రూరల్ ఇన్చార్జ్ బాజిరెడ్డి జగన్ నాయకత్వంలో డిచ్‌పల్లిలో భారీ నిరసన ధర్నా మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడి అత్యంత హేయమైన చర్య అని, ప్రజాస్వామ్యంలో ఇటువంటి ఘటనలకు తావులేదని నిజామాబాద్ రూరల్ బి ఆర్ ఎస్ ఇన్చార్జ్ బాజిరెడ్డి జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తూ డిచ్‌పల్లిలో నిర్వహించిన భారీ నిరసన ధర్నా కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... సమాజంలో మహిళలకు గౌరవం, రక్షణ కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన మహిళా ప్రజాప్రతినిధులకే రక్షణ లేకపోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. మహిళలపై జరుగుతున్న హింసను, దాడులను ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని పిలుపునిచ్చారు. మహిళా ఎమ్మెల్యేలపై దాడికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి చట్టరీత్యా కఠినంగా శిక్షించాలి. ప్రజాప్రతినిధులతో పాటు రాష్ట్రంలో మహిళలందరికీ పూర్తి–స్థాయి భద్రత కల్పించాలి. రాజకీయ కక్షసాధింపులకు, మహిళలపై భౌతిక దాడులకు స్వస్తి పలకాలి."మహిళలపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు. ప్రజాస్వామ్యాన్ని, ప్రజాప్రతినిధుల హక్కులను కాపాడుకునేందుకు మా పోరా–టం నిరంతరం కొనసాగుతుంది" అని నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను తెలియజేశారు.

# అరెస్టులతో బీఆర్ఎస్ గొంతును అణచలేరు : వి.ఆర్. నరసింహ




**వికారాబాద్ 8 సెప్టెంబర్ నేటి శుభోదయ :** వికారాబాద్: మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలకు జరిగిన అవమానాన్ని నిరసిస్తూ వికారాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన ధర్నాను పోలీసులు అడ్డుకోవడం, అరెస్టులు చేయడం, నాయకులను హౌస్ అరెస్ట్ చేయడం సరైన పద్ధతి కాదని బీఆర్ఎస్ వికారాబాద్ బీసీ జనరల్ సెక్రటరీ వి.ఆర్. నరసింహ అన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌ను హౌస్ అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మహిళా ఎమ్మెల్యేలకు జరిగిన అవమానానికి ముఖ్యమంత్రి బాధ్యత వహించి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇది ఇద్దరు మహిళా ఎమ్మెల్యేలకు జరిగిన అవమానం మాత్రమే కాకుండా తెలంగాణ మహిళలందరికీ జరిగిన అవమానంగా పేర్కొన్నారు. అరెస్టులు, హౌస్ అరెస్టులతో బీఆర్ఎస్ పార్టీ గొంతును అణచలేరని, మహిళల గౌరవం కోసం పోరాటం కొనసాగిస్తామని నరసింహ స్పష్టం చేశారు.

# 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలి !




**నిజామాబాద్ రూరల్ సిరికొండ నేటి శుభోదయ ప్రతినిధి సెప్టెంబర్ 08 :** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, ఈరోజు డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించడం జరిగింది.మహాలక్ష్మి – మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ₹2,500 ఆర్థిక సహాయం, ₹500కే గ్యాస్ సిలిండర్ రైతు భరోసా – రైతులకు ఎకరాకు ₹15,000 పెట్టుబడి సాయం, కౌలు రైతులకు కూడా మద్దతు గృహజ్యోతి – ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ఇందిరమ్మ ఇండ్లు – ఇల్లు లేని వారికి ఇల్లు, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయంయువ వికాసం – విద్యార్థులు, యువతకు విద్యా మరియు ఉపాధి అవకాశాల కోసం ₹5 లక్షల వరకు సహాయంచేయూత – వృద్ధులు, వితంతువులు, ఇతర అర్హులకు పెన్షన్ పెంపుప్రజలకు ఇచ్చిన హామీలను కాలయాపన చేయకుండా 6 గ్యారంటీలను సంపూర్ణంగా అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని అంబేద్కర్ విగ్రహం సాక్షిగా కోరడం జరిగింది.ప్రజల హక్కుల కోసం... హామీల అమలు కోసం... మా పోరాటం కొనసాగుతుందని నాయకులు తెలిపారు సిరికొండ మండలం బిఆర్ఎస్ నాయకులు పాల్గొనడం జరిగింది సొసైటీ మాజీ చైర్మన్ గంగారెడ్డి గారు భూషణ్ రెడ్డి అన్సార్ సిరికొండ సర్పంచ్ సాయి చరణ్ సురేందర్ చిన్న గంగారెడ్డి మాజీ సర్పంచ్ రాజారెడ్డి మాజీ సొసైటీ చైర్మన్ గోపాల్ మాజీ సర్పంచ్ దాస్ మైలారం దయానంద్ రావట్ల మాజీ సర్పంచ్ రాజారెడ్డి తోట రాజేందర్ అజ్మీర జగన్ మల్యాల సుమన్ తదితరులు పాల్గొన్నారు

# ఇంటి స్థలం ఇల్లు కోసం మరణించిన దొడ్డి అశోక్ - కుటుంబానికి ప్రభుత్వం చేయూత



**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 8 నేటి శుభోదయ :** యాచారం మండల చింతపట్ల గ్రామ పంచాయతీ పరిధిలో నివసిస్తున్న దొడ్డి రజిని,భర్త దివంగత దొడ్డి అశోక్ కి ఇందిరమ్మ ఇల్లు పదకం క్రింద మంజూరు చేయబడిన మంజూరు పత్రం అలాగే 120 గజాల స్థలాన్ని కేటాయిస్తూ పత్రాన్ని అందజేశారు. యాచారం మండలం అధికారి ఎంపీడీవో రాధారాణి,గ్రామ సర్పంచ్ తొట్ల రమేష్ సమక్షంలో ఇవడం జరగింది. దివంగత దొడ్డి అశోక్ మరణించినందున,కుటుంబానికి ప్రభుత్వం ద్వారా ఇంటి నిర్మాణం కొరకు స్థలం హౌస్ సైట్ మంజూరు చేయబడినది. తదనంతరం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణమునకు 5.లక్షల రూపాయలు మంజూరు చేయబడినది ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# అసమానతలేని సమాజ నిర్మాణమే ఎమ్మార్పీఎస్ లక్ష్యం
## డిచ్‌పల్లి మండల నూతన కమిటీ ఏర్పాటు



**నిజామాబాద్ రూరల్ డిచ్‌పల్లినేటి శుభోదయ ప్రతినిధి సెప్టెంబర్ 8 :** అసమానతలు, వివక్షతలకు తావులేని సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమ శక్తిగా ముందుకు రావాలని ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఇన్చార్జి గంధమాల నాగభూషణం మాదిగ పిలుపునిచ్చారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాలు, జిల్లా ఇన్చార్జి మాసాయిపేట యాదగిరి మాదిగ సూచనల మేరకు సంస్థాగత నిర్మాణంలో భాగంగా మంగళవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీని ఏర్పాటు చేశారు.డిచ్‌పల్లి మండల ఇన్చార్జి డప్పు నరసయ్య మాదిగ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గంధమాల నాగభూషణం మాదిగ మాట్లాడుతూ.. సమాజంలో ఎలాంటి వివక్షత లేకుండా అన్ని సామాజిక వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. వ్యక్తులు కేవలం వ్యక్తులుగా కాకుండా ఉద్యమ శక్తులుగా మారి సామాజిక న్యాయం కోసం నిరంతరం పనిచేయాలని సూచించారు.ఎమ్మార్పీఎస్ సంస్థాగత బలోపేతంలో భాగంగా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల్లో నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థాయి నుంచి మండల, నియోజకవర్గ స్థాయి వరకు ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసి సామాజిక న్యాయం సాధించే దిశగా ప్రతి కార్యకర్త అంకిత భావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ డిచ్‌పల్లి మండల నూతన కార్యవర్గంమండల అధ్యక్షులు: నక్క సాయిబాబా మాదిగఅధికార ప్రతినిధి: గర్క సాయికుమార్ మాదిగప్రధాన కార్యదర్శి: నమిల్ల రామచంద్ర మాదిగకార్యనిర్వహణ అధ్యక్షులు: రహీంపేట గంగాధర్ మాదిగఉపాధ్యక్షులు: ఇందూరు బాలకృష్ణ మాదిగ కొండ్ర చిన్న సాయిలు మాదిగ, ఎర్ర రమేష్ మాదిగకోశాధికారి: కిందింటి నరేష్ మాదిగకార్యదర్శి: ఎర్రవెల్లి మోహన్ మాదిగ సహాయ కార్యదర్శి: దుర్గ గంగాధర్ మాదిగ– గంధమాల బాబు మాదిగఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను నాయకులు అభినందించి, ఎమ్మార్పీఎస్ ఆశయ సాధనకు ఐక్యంగా పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రూరల్ మండల ఇన్చార్జి యాదాసి శ్రీరాములు మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు తెడ్డు బాబు మాదిగతో పాటు పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



**వికారాబాద్ 8 సెప్టెంబర్ నేటి శుభోదయ :** ప్రభుత్వం నుంచి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు మంగళవారం బంద్ నిర్వహించాయి. ఇందులో భాగంగా విశ్వభారతి డిగ్రీ కళాశాలను మూసివేసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ జి. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో కళాశాలల నిర్వహణ, అధ్యాపకులు, సిబ్బంది వేతనాల చెల్లింపులో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన విద్యా సౌకర్యాలు కల్పించడంపైనా ఆర్థిక భారం పడుతోందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి ప్రైవేట్ డిగ్రీ కళాశాలలను ఆర్థిక సంక్షోభం నుంచి ఆదుకోవాలని కోరారు.నిరసనలో బస్వరాజు, భానుప్రకాష్‌రెడ్డి, జహీర్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 6 గ్యారెంటీలు, ప్రజా సమస్యలు, 22-A భూముల సమస్యపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జనసేన అసెంబ్లీ ముట్టడి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 08 నేటి శుభోదయ :** హైదరాబాద్:6 గ్యారెంటీల అమలు,ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు,ముఖ్యంగా 22–A భూముల సమస్యపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపట్టారు.ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించిన జనసేన నాయకులు,వీరమహిళలను పోలీసులు అరెస్టు చేసి మెహదీపట్నం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మీసాల శ్రీనివాస్ రావు,శ్రీధర్ శర్మ, ప్రేమ్ గాంధీ, హైందవి రెడ్డి, రాంబాబు పైడిపల్లి, శోభనబాబు, గంగం అజయ్ కుమార్,ముజఫర్ అలీ, పద్మజ,వెంకటలక్ష్మి , భవ్య, రేఖ, సందీప్, వెంకటేష్, విజయ్ కుమార్ తదితర జనసేన నాయకులు, వీరమహిళలు పాల్గొన్నారు. 22–A భూముల సమస్యతో వేలాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,ప్రజలకు న్యాయం జరిగే వరకు జనసేన పార్టీ పోరాటం కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు.ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం,ప్రశ్నించే గొంతులను అరెస్టులతో అణచివేయడం సరికాదని జనసేన నాయకులు అన్నారు.ప్రజల హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం జనసేన పోరాటం —— అరెస్టులతో ఆగదు అని అన్నారు.

## స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు పినపాకలో కాంగ్రెస్ భారీ నిరసన ర్యాలీ




**పినపాక, నేటి శుభోదయ, సెప్టెంబర్ 8 :** పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు, తెలంగాణ శాసనసభ దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ పినపాక మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించారు. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిని దళిత సామాజిక వర్గాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధు వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు దళితుల గౌరవానికి భంగం కలిగించిన తాతా మధుపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని పినపాక ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చిట్టిమల్ల ప్రసాద్ కోరారు. దళితులను ఎల్లప్పుడూ బీఆర్ఎస్ పార్టీ చిన్నచూపు చూస్తోందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పేరం వెంకటేశ్వర్లు ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు అబద్ధపు వాగ్దానాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు ఎమ్మెల్సీ తాతా మధును పదవి నుంచి బర్తరఫ్ చేయకపోతే జిల్లా మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున ధర్నాలు, ఆందోళనలు చేపడతామని జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బోడా రమేష్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ నాయకులు గొడిశాల రామనాథం, గంగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బోడా రమేష్, స్థానిక సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భూముల రీ-సర్వే పనులను వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 08, (నేటి శుభోదయ) :** పాల్వంచ మండలంలోని బోజ్యా తండా పరిధిలో చేపడుతున్న భూముల రీ-సర్వే పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం బోజ్యా తండా పరిధిలోని సర్వే నంబర్ 77లో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.రీ-సర్వేలో భాగంగా రోవర్ పరికరాల సహాయంతో భూములను కొలుస్తున్న విధానాన్ని, భూముల హద్దులను గుర్తిస్తున్న ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూముల వాస్తవ విస్తీర్ణం, హద్దులు, స్థానాన్ని ఖచ్చితంగా గుర్తించి, సంబంధిత భూ రికార్డులతో అనుసంధానం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.బోజ్యా తండా పరిధిలో మొత్తం 458 ఎకరాల్లో రీ-సర్వే చేపట్టాల్సి ఉండగా, ప్రస్తుతం సర్వే నంబర్ 77లో 88 ఎకరాల్లో పనులు కొనసాగుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటివరకు జరిగిన సర్వే పురోగతి, మిగిలిన భూముల్లో చేపట్టాల్సిన పనులు, అవసరమైన సిబ్బంది, పరికరాల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు.ప్రతి భూ యజమాని భూమి హద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అందుబాటులో ఉన్న భూ రికార్డులతో సరిపోల్చాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వేలో ఎలాంటి జాప్యం లేకుండా సిబ్బంది సమన్వయంతో పనిచేసి, ప్రతిరోజూ నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.గ్రామంలో భూ రీ-సర్వే పనులను మూడు రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సర్వే సమయంలో భూ యజమానుల నుంచి అవసరమైన వివరాలు, రికార్డులు, పత్రాలు సేకరించి, భూమి హద్దులను స్పష్టంగా గుర్తించాలని తెలిపారు. భవిష్యత్‌లో భూ వివాదాలకు అవకాశం లేకుండా రీ-సర్వేను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన కలెక్టర్ రీ-సర్వే ప్రక్రియపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రైతుల భూ పత్రాలను పరిశీలించారు. పట్టాదారు పాస్‌బుక్, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర అందుబాటులో ఉన్న భూ రికార్డులను సర్వే అధికారులకు అందజేయడంతో పాటు, క్షేత్రస్థాయిలో తమ భూముల వాస్తవ హద్దులను చూపించి సర్వేకు సహకరించాలని సూచించారు.రీ-సర్వే





పూర్తయిన అనంతరం భూముల హద్దులు, విస్తీర్ణం తదితర వివరాలు మరింత స్పష్టంగా నమోదయ్యే అవకాశం ఉన్నందున, రైతులు సర్వే బృందాలకు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. సర్వే సమయంలో ఎదురయ్యే సమస్యలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ధార ప్రసాద్, సర్వేయర్లు వెంకన్న, కళ్యాణ్, లైసెన్స్డ్ సర్వేయర్లు మధు, వంశీ, కవిత, జీపీఓ రాధా, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సువర్చలకు ఓయు నుండి డాక్టరేట్ ప్రధానం

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 08 నేటి శుభోదయ :** తెలంగాణ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ లో అసిస్టెంట్ ప్రొఫెసర్ (C)గా విధులు నిర్వహిస్తున్న యెండల సువర్చలప్రదీప్ కు ఓయూ 85 వా వా స్నాతకోత్సవంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ డాక్టరేట్ ప్రధానం చేసారు.సువర్చల "ఎడ్యుకేషన్ అమాంగ్ రూరల్ డిసడ్వాంటేజ్ క్లాస్ గర్ల్స్: ఏ స్టడీ ఆన్ స్కూల్ అడ్జస్ట్మెంట్ అండ్ ఎకనామిక్ పెర్ఫార్మన్స్" అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ ఆంగ్ల విభాగ ప్రొఫెసర్ టి.విజయ్ కుమార్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు.మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన 85 వ కాన్వకేషన్ ఉత్సవానికి గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్ల ముఖ్య అతిథిగా హాజరైనారు.ఈ సందర్భంగా సువర్చల మాట్లాడుతూ....తన కుటుంబం అందించిన సహకారంతో ఈ డిగ్రీ పూర్తి చేశానని ఆమె తెలిపారు.సువర్చలను యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ బోధన,బోధనేతర సిబ్బంది,విద్యార్థులు ఆమెను అభినందించారు.




## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ వికారాబాద్‌లో కాంగ్రెస్ భారీ నిరసన

**వికారాబాద్ 8సెప్టెంబర్ నేటి శుభోదయ :** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ వికారాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య ఆధ్వర్యంలో రెస్ట్‌హౌస్ నుంచి ఎంఆర్‌పీ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టి, అనంతరం ఎన్‌టీఆర్ చౌరస్తా వద్ద కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల దిష్టిబొమ్మలను దహనం చేశారు.ఈ సందర్భంగా గడ్డం అనన్య మాట్లాడుతూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధు, నవీన్‌రెడ్డిలపై చర్యలు తీసుకుని ఎమ్మెల్సీ పదవుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. తాతా మధు వ్యాఖ్యలను బీఆర్ఎస్ అధిష్ఠానం ఖండించి స్పీకర్‌కు క్షమాపణలు చెప్పాలని కోరారు.దళిత నాయకుడైన ప్రసాద్ కుమార్‌కు కాంగ్రెస్ కుటుంబాలు, ప్రజల అండదండలు ఉన్నాయని, ఆయనను అవమానించేలా మాట్లాడటం తగదని అన్నారు. ప్రసాద్ కుమార్ రాజకీయాల్లో ఎన్నో ఏళ్లుగా కష్టపడి మచ్చలేని నాయకుడిగా ఎదిగి శాసనసభ స్పీకర్ స్థాయికి చేరుకున్నారని పేర్కొన్నారు. స్పీకర్ పదవికి, ఆయన వయస్సుకు గౌరవం ఇవ్వకుండా చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయ చరిత్రలో చీకటి రోజుగా మిగిలిపోతాయని అన్నారు.బీఆర్ఎస్ నేతల వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో ప్రజలే ఆ పార్టీకి తగిన సమాధానం చెబుతారని అనన్య అన్నారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో తమ కుటుంబానికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, ఆమెను ఎల్లప్పుడూ గౌరవిస్తామని తెలిపారు.కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ధారాసింగ్ జాదవ్‌తో పాటు వికారాబాద్,





మర్పల్లి, దారూర్ ఏఎంసీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, కౌన్సిలర్లు, సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన బీసీ మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందజేత
### - మున్సిపల్ కమిషనర్ ఎన్. మనోహర్

**మంథని, సెప్టెంబర్ - 08( నేటి శుభోదయ ) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకం" ద్వారా అర్హులైన వెనుకబడిన తరగతులకు (బీసీ) చెందిన మహిళలకు ఆటోమేటిక్ కుట్టు మిషన్లను 100 శాతం సబ్సిడీతో అందించేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు పెద్దపల్లి జిల్లా కలెక్టర్/చైర్మన్ (బీసీడీడీ ) కోయ శ్రీ హర్ష 2026, సెప్టెంబర్ – 02 న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పథకం ద్వారా పేద, నిరుద్యోగ మరియు అర్హత కలిగిన బీసీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించడంతో పాటు వారి ఆర్థిక స్వావలంబనను పెంపొందించడం, ఆదాయ అవకాశాలను విస్తరించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు. అర్హత కలిగిన మహిళలు 2026, September 15 తేది లోపు TGOBMMS వెబ్ దరఖాస్తు చేసుకొని మున్సిపల్ కార్యాలయం నందు దరఖాస్తులు అందజేయ గలరని కోరుచున్నాము. దరఖాస్తుదారులు బీసీ వర్గానికి చెందినవారై, 18 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక కుటుంబ ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలకు మించకూడదు. కుటుంబానికి ఒక్క కుట్టు మిషన్ యూనిట్ మాత్రమే మంజూరు చేస్తారు, తెల్ల రేషన్ కార్డు/ఆహార భద్రత కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్, వయస్సు ధ్రువీకరణ పత్రం, టైలరింగ్ నైపుణ్య ధ్రువీకరణ వంటి పత్రాలను పరిశీలించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు.




## నాగార్జున ప్రైవేట్ స్కూల్ పై సమగ్ర విచారణ చేపట్టాలని డా.బీఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం..

**మహబూబాబాద్ నేటి శుభోదయ, సెప్టెంబర్ 8 :** కురవి మండల కేంద్రంలోని నాగార్జున ప్రైవేట్ స్కూల్‌పై వస్తున్న ఆరోపణలపై అధికారులు తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజల ముందుంచాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కురవి మండల కేంద్రంలోని డా.బీఆర్.అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవేందర్ నాయక్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ అనుమతులు లేవని అధికారులు చెబుతున్నప్పుడు.. అదే పాఠశాలకు విద్యాశాఖ గుర్తింపు ఎలా లభించింది? అనే ప్రశ్నకు సంబంధిత అధికారులు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పాఠశాల భవన నిర్మాణాలు, అదనపు నిర్మాణాలు, భవన భద్రత, గ్రామపంచాయతీ అనుమతులు, విద్యాశాఖ గుర్తింపు తదితర అంశాలపై వస్తున్న ఆరోపణలను అధికారులు నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు.ఆరోపణలు వెలువడినప్పటికీ ఇప్పటివరకు సమగ్ర విచారణలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. విద్యార్థుల భద్రతకు సంబంధించిన అంశాల్లో అధికారుల నిర్లక్ష్యానికి తావుండకూడదని అన్నారు. గ్రామపంచాయతీ, రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో సంయుక్త తనిఖీలు నిర్వహించి పాఠశాల నిర్మాణాలు, అనుమతులు, గుర్తింపుకు సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలించాలని కోరారు.నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు విచారణలో తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని,



ఆరోపణల్లో వాస్తవం లేదని తేలితే అధికారికంగా ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనుమతులు, గుర్తింపు విషయంలో ఏదైనా లోపం ఉంటే దానికి బాధ్యత ఎవరిదో తేల్చాల్సిన అవసరం ఉందన్నారు.అలాగే గ్రామసభలో తీసుకున్న తీర్మానాన్ని వెంటనే అమలు చేసి, సమగ్ర విచారణ నిర్వహించి నివేదికను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. విద్యార్థులు చదువుకునే పాఠశాల భవనాల భద్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే విద్యార్థుల భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందన్నారు. తక్షణమే సంయుక్త తనిఖీలు చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, లేనిపక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తదుపరి దశలో ఆందోళనలు చేపడతామని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ నాయక్ హెచ్చరించారు.

Neti Shubodyaa 09.09.2026_Layout 1 9/9/2026 6:48 AM Page 12



# బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వెంటనే రాజీనామా చేయాలి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 08 నేటి శుభోదయ :** నిజామాబాద్ కార్పొరేషన్ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ జిల్లా కాంగ్రెస్ భవన్ లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు ఉద్దేశ్య పూర్వకంగా చేసిన అనుచిత వ్యాఖ్యల వెనుక మాజీ సీఎం కెసిఆర్ ప్రోద్బలం ఉందని,కెసిఆర్ ను,ఎమ్మెల్సీ తాతా మధును వెంటనే ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి అని డిమాండ్ చేశారు.వర్షాకాల అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాజీ సీఎం కేసీఆర్,మాజీ మంత్రులు కేటీఆర్,హరీశ్ రావుల ప్రోత్సాహంతో, ప్రోద్బలంతో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అసెంబ్లీ స్పీకర్,దళిత నేత గడ్డం ప్రసాద్ కుమార్ ని,వాళ్ళ దివంగత అమ్మను బూతులు తిడుతూ దుర్భాషలాడడాన్ని కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.ఆధిపత్య కుల అహంకారంతో అసెంబ్లీ దళిత స్పీకర్ ను బహిరంగంగా అవమానించిన బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును వెంటనే ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం అరెస్ట్ చేసి శిక్షించాలని రాష్ట్ర డిజిపి ని కోరుతున్నామని అన్నారు.అదే విధంగా ఎమ్మెల్సీ పదవి నుండి శాశ్వతంగా అనర్హుడిగా ప్రకటించాలని తెలిపారు.ఎర్రవెల్లి ఫాం హౌస్ లో జరిగిన బిఆర్ఎస్ఎల్పి సమావేశం లో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను,ఎమ్మెల్సీలను రెచ్చగొట్టి అసెంబ్లీ కి పంపి తాతా మధుతో స్పీకర్ ను బూతులు తిట్టించిన బిఆర్ఎస్ అధ్యక్షులు,మాజీ సీఎం కేసీఆర్ పై కూడా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసి చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నామని బొబ్బిలి రామకృష్ణ అన్నారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కేశ మహేష్,ఈఆర్ఓ కో ఆర్డినేటర్ అబ్దుల్ వహీద్,టౌన్ డిసిసి ఉపాధ్యక్షులు సలీం,కార్పొరేటర్ ప్రవీణ్ గౌడ్,గంగాధర్,కో ఆప్షన్ మెంబర్ బొబ్బిలి మురళీ,సకినాల శివ ప్రసాద్, జిల్లెల రమేష్, అమరాజు, సాయి బసవ, వహీద్,అపర్ణ,ఆకుల శ్రీశైలం, మల్లేష్ యాదవ్, బండారు రమేష్, మహమ్మద్ సముద్దీన్, సయ్యద్ అర్షద్, షేక్ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్‌పై వ్యక్తిగత వ్యాఖ్యలు తగవు - రాచమల్ల సురేష్



**శంషాబాద్, సెప్టెంబర్ 08, నేటి శుభోదయ:** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలను రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ నాయకుడు, ఎస్వీజీ డెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ రాచమల్ల సురేశ్ ఖండించారు. రాజ్యాంగబద్ధమైన ఉన్నత పదవిలో ఉన్న స్పీకర్‌పై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదన్నారు. తాతా మధు వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్‌ను అవమానించడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అసెంబ్లీ ఎదుట శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, సునీతారెడ్డిల నిరసన సందర్భంగా పోలీసుల వ్యవహారశైలిని కూడా ఆయన తప్పుబట్టారు. మహిళా నాయకులతో వ్యవహరించే సమయంలో మహిళా పోలీసులను వినియోగించాలని, ఘటనపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

# దళిత వ్యతిరేకి బిఆర్ఎస్ పార్టీ

## - అధికారం కోల్పోయామనే అక్కసుతో దళితులపై దాడి





**ఇబ్రాహీంపట్నం సెప్టెంబర్ 8 నేటి శుభోదయ :** ఇబ్రహీంపట్నం పట్టణ కేంద్రంలో శాసనసభ స్పీకర్ పై పరుష పదజాలంతో దూషించిన బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాత మధుని తక్షణమే సస్పెండ్ చేసి కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు దిష్టిబొమ్మను దగ్ధం చేసి చావు డప్పు కొట్టి నిరసన వ్యక్తం చేసిన కాంగ్రెస్ పార్టీ.కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర దళిత విభాగం పిలుపు మేరకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొంకని విజయ్ మాదిగ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం దళితుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న కించపరిచే మాటలు మాట్లాడుతున్నబిఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు.భారత రాజ్యాంగం కల్పించిన అత్యున్నతమైన పవిత్ర పీఠంపై ఆసీనులై ఉన్న దళిత బిడ్డ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై దొరల గడిల బానిస ఎమ్మెల్సీ తాతా మధు ఇష్టానుసారంగ నోరుపారేసుకోవడంబిఆర్ఎస్ పార్టీ యొక్క దళిత వ్యతిరేక వైఖరికి అహంకారానికి నిదర్శనం.అధికారం కోల్పోయామనే అక్కసుతో,దళిత నాయకత్వం ఎదుగుతుంటే చూసి ఓర్వలేక రాజ్యాంగ వ్యవస్థలను కించపరిచేలా మాట్లాడటం.బిఆర్ఎస్ పార్టీ సంస్కారహీనత కు పరాకాష్ట స్పీకర్ తల్లిని అవమానించేలా మాట్లాడటం అందరికీ జరిగిన అవమానంగా భావిస్తున్నాం. మనందరం ముక్త కంఠంతో ఖండించాల్సిన అవసరం ఉంది. రాజకీయాలకు అతీతంగా మనం వ్యవహరించాలి. ఇలాంటి దుర్మార్గపు పోకడలను నియంత్రించాలి.ఇది అత్యంత తీవ్రమైన నేరం.ఇది కేవలం దళితులకు జరిగిన అవమానం కాదు.ఇది అందరికీ జరిగిన అవమానం.ఇది తెలంగాణ చరిత్రలో చీకటి రోజు అని,ఇది కేవలం స్పీకర్ కి కాదు 4 కోట్ల ప్రజల ఆత్మగౌరవానికి జరిగిన అవమానమని అన్నారు.భారతదేశ చరిత్రలో ఏ చట్టసభల్లోనూ ఇలాంటి దుర్మార్గమైన, హేయమైన సంఘటన జరగలేదని పేర్కొన్నారు.రాజకీయాలకు అతీతంగా ప్రతి సభ్యుడు మాట్లాడాల్సిన అవసరం ఉంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఇంతటి దుర్మార్గమైన మాటలు ఎవరూ మాట్లాడకూడదు.సభా మర్యాదను కించపరిచిన సభ్యుడిని వెంటనే అనర్హుడిగా ప్రకటించాలని, ప్రతిపక్ష నాయకులు సభకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు క్యారగారి శ్రీధర్.కాంగ్రేస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొత్త కురుమ శివకుమార్.రాచర్ల వెంకటేశ్వర్లు.మంకాల దాసు. కొంగర విష్ణు వర్ధన్ రెడ్డి.కాంగ్రేస్ పట్టణ అధ్యక్షుడు గౌస్ పాషా.సింగల్ విండో చైర్మన్ హన్మంత్ రెడ్డి.జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త కురుమ మంగమ్మ.కౌన్సిలర్స్ నీలం భాను బాబు.దారు రాఘవేందర్.దొంతర మోని భార్గవి రాజు.రామదాస్ నాయక్.మార్కెట్ డైరక్టర్ మహేష్ గౌడ్ ,బుగ్గ రాములు,కోడూరు రమేష్.ఈగల రాములు.ఏర్పుల రాజు,సతీష్ ,సత్య వాణి.ప్రేమ్. రమాకాంత్ రెడ్డి.రామకృష్ణ యాదవ్.భాను... సుమన్. కిరణ్. నగేష్. అయాన్. ఇమ్రాన్.తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధు దిష్టిబొమ్మ దహనం





**షాబాద్ సెప్టెంబర్ 8 నేటి శుభోదయ :** తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారిపై బీఆర్ఎస్ నాయకుడు తాతా మధు చేసిన అనుచిత అహంకారపూరిత వ్యాఖ్యలను షాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. మంగళవారం షాబాద్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించి, తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేసి తమ తీవ్ర నిరసనను తెలిపారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన అత్యున్నతమైన స్పీకర్ స్థానం తెలంగాణ ప్రజాస్వామ్యానికి ప్రతీక అని, అలాంటి పదవిలో ఉన్న వ్యక్తిని ఉద్దేశించి బాధ్యతారాహిత్యంగా మాట్లాడడం బీఆర్ఎస్ పార్టీ దిగజారుడు రాజకీయాలకు అద్దం పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం కోల్పోయిన అక్కసుతోనే బీఆర్ఎస్ నాయకులు విచక్షణ కోల్పోయి ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు. తాతా మధు వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని స్పీకర్ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు ధర్నా దిష్టిబొమ్మ దహనం అనంతరం షాబాద్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న కాంగ్రెస్ నాయకులు, శాసనసభ స్పీకర్‌ను అవమానించిన తాతా మధుపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్సెకి రాతపూర్వక ఫిర్యాదు సమర్పించారు ఈ నిరసన కార్యక్రమంలో డిసిసి జనరల్ సెక్రటరీ భార్గవ్ రామ్, సెక్రటరీ యాదయ్య, షాబాద్ సర్పంచ్ అశోక్, పోతుగల్ సర్పంచ్ పామెన నరసింహులు, వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నయ్య, కిసాన్ సెల్ వెంకట్ రెడ్డి, సర్దార్ నగర్ మార్కెట్ డైరెక్టర్ నర్సింలు, సీనియర్ నాయకులు లింగేష్, ఆనంద్, యువ నాయకులు రవీందర్ రెడ్డి, వెంకటయ్య, సుభాష్, నర్సింలు.టి, నవీన్, బుచ్చయ్య శ్రీను, గూడూరు, బందయ్య, మల్లేష్, టీ రాజు, మాజీ సర్పంచ్ శేఖర్ రెడ్డి, ఉప సర్పంచ్ దయాకర్ చారి, మహేందర్, హరివర్ధన్, సంజీవ, సోషల్ మీడియా ప్రతినిధులు సమీర్, సలీం మరియు మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి






**ఇబ్రాహీంపట్నం సెప్టెంబర్ 8 నేటి శుభోదయ :** యాచారం మండల కేంద్రంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థత విధానాలతో రోజురోజుకు నిరుద్యోగం పెరిగిపోతుందని డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ అన్నారు.భారత ప్రజాతంత యువజన సమాఖ్య రంగారెడ్డి జిల్లా మహాసభలు యాచారం మండల కేంద్రంలో నిర్వహించడం జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిధిగా హాజరైన డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ మాట్లాడుతూ,దేశ యువతకు ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకుండా 12 సంవత్సరాలు గడుస్తున్నా కోట్లాది మంది నిరుద్యోగ యువతకు తీవ్ర నిరాశ,అన్యాయం మాత్రమే మిగిల్చిందని,ఒకవైపు ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ ఉద్యోగ అవకాశాలను తగ్గిస్తుండగా, మరోవైపు నీట్,రైల్వే, బ్యాంకింగ్ వంటి పోటీ పరీక్షల్లో వరుసగా ప్రశ్నపత్రాల లీకులు జరుగుతూ విద్యార్థి,యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని అన్నారు.అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు నిరుద్యోగులందరికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని,జాబ్ క్యాలెండర్ ప్రకటించి నోటిఫికేషన్లు వేసి ఉద్యోగాలను భర్తీ చేస్తామని, ఎన్నికల మేనిఫెస్టోలో యూత్ డిక్లరేషన్ ని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచిపోయిన ఇప్పటివరకు జాబ్ క్యాలెండర్ తో పాటు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదు.సమగ్రమైన వివరాలతో జాబ్ క్యాలెండర్ను ప్రకటించి ఉద్యోగాల భర్తీకై నోటిఫికేషన్లను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం వేయాలన్నారు. అదేవిధంగా ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించే అంతవరకు నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి 4000 రూపాయలు ఇవ్వాలని,స్వయం ఉపాధి రుణాలపై రాజీవ్ యువ వికాస్ పథకాన్ని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించి లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయడం లేదు.దరఖాస్తులకే పరిమితం కాకుండా అర్హులైన నిరుద్యోగ యువత అందరికి రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా స్వయం ఉపాధి రుణాలు అందించాలన్నారు.అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కఠినమైన చర్యలు తీసుకోవాలని,నిరంతర నిఘా అక్రమ రవాణా కు అడ్డుకట్ట వేసి విద్యార్థి, యువత ప్రాణాలను రక్షించాలని అన్నారు.రంగారెడ్డి జిల్లాలో అనేక పరిశ్రమలు ఉన్న స్థానికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం లేదన్నారు.ఇక్కడి వనరులను అన్నిటిని ఉపయోగించుకొని పరిశ్రమలు స్థానికత పేరుతో ఉద్యోగాలు ఇవ్వకుండా స్థానిక యువతను మోసం చేస్తున్నాయని అన్నారు.ప్రభుత్వమే స్థానిక పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఆలంపల్లి జంగయ్య, రాఘవేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో జిల్లా కార్యదర్శి పి జగన్,ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.శంకర్,డివైఎఫ్ఐ జిల్లా నాయకులు శివశంకర్,మహేష్,దినేష్, కవిత,ప్రశాంత్,శివ, హఫీజ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్ తల్లిపై వ్యాఖ్యలకు కాంగ్రెస్ నిరసన



**శంషాబాద్, సెప్టెంబర్ 08, నేటి శుభోదయ :** రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ తల్లిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు వచ్చిన వ్యాఖ్యలను నిరసిస్తూ శంషాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పార్టీ శంషాబాద్ అధ్యక్షుడు మహేందర్ ముదిరాజ్, పిల్లనగ్రోవి సంజయ్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, జలపల్లి నరేందర్, రణధీర్‌రెడ్డి పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం రోడ్డు షో నిర్వహించి బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. స్పీకర్ కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని నాయకులు అన్నారు. తాతా మధు, నవీన్‌రెడ్డిలు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, తాతా మధుపై తగిన చర్యలు తీసుకోవాలని గుత్తా సుఖేందర్‌రెడ్డిని కోరారు. రాజకీయాల్లో వ్యక్తిగత, కుటుంబపరమైన వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని సూచించారు.

# తెలంగాణ రాజ్యాధికార పార్టీ లో చేరిన టిఇపిఏ వ్యవస్థాపకులు ధార మధు



**మంథని, సెప్టెంబర్-08, నేటి శుభోదయ :** తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టిఆర్‌పి)లో తెలంగాణ ఎడ్యుకేషనల్ పేరెంట్స్ అసోసియేషన్ (టిఇపిఏ) వ్యవస్థాపకులు ధార మధు చేరారు. సోమవారం హైదరాబాద్‌లో టిఆర్‌పి వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్న సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకుని పార్టీలో చేరారు. ధార మధు పార్టీలో చేరడంతో విద్యా రంగంలో టిఆర్‌పి మరింత బలోపేతం అవుతుందని పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యారంగ సమస్యలపై ధార మధు చేస్తున్న కృషి పార్టీకి మరింత ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ధార మధుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మెరుగు చందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కురవి వీరభద్రస్వామి ఆలయంలో ఆదిత్య ప్రత్యేక పూజలు



**మహబూబాబాద్ సెప్టెంబర్ 8 ( నేటి శుభోదయ) :** టీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల కవిత కుమారుడు ఆదిత్య మంగళవారం కురవి మండల కేంద్రంలోని శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానాన్ని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం కురవి హైస్కూల్‌లో విద్యార్థుల సౌకర్యార్థం ఆదిత్య సహకారంతో 1,40,000లతో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో యువకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆదిత్యను కలిశారు. ఈ కార్యక్రమంలో యువకులు గంధసిరి వేణు గౌడ్ కేశరాజు రాజేష్ గౌడ్, సంగం హర్షిత్ గజ్జల కార్తీక్, దాసు కత్తి, వినయ్, ఫోటోగ్రాఫర్ సంతోష్, దిలీప్, సాయి తదితరులు పాల్గొన్నారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు.

# ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలి





**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 08 నేటి శుభోదయ :** గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకోవాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య,అదనపు కలెక్టర్ భుజంగరావు సూచించారు.వినాయక చతుర్థి ఉత్సవాలను పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు.పోలీస్ కమిషనర్ సాయి చైతన్య,అదనపు కలెక్టర్ భుజంగరావు సంబంధిత అధికారులకు కీలక సూచనలు చేశారు.గణేష్ ఉత్సవాలు,జెండా బాలాజీ జాతర సందర్భంగా చేపట్టాల్సిన చర్యలు,అందుబాటులోకి తేవాల్సిన సదుపాయాల గురించి సార్వజనిక్ గణేష్ మండలి ప్రతినిధులు,శాంతి కమిటీ సభ్యులు,ముస్లిం మత పెద్దలు,మండపాల నిర్వాహకులు పలు ప్రతిపాదనలు చేస్తూ తమ అభిప్రాయాలను వెల్లడించారు.శాంతియుత వాతావరణంలో,భక్తి శ్రద్ధలతో మతసామరస్యానికి ప్రతీకగా వేడుకలు జరిగేలా కృషి చేస్తామని అన్నారు. సీ.పీ సాయి చైతన్య,అదనపు కలెక్టర్ భుజంగరావులు మాట్లాడుతూ......ఉత్సవాల నిర్వహణకు అధికార యంత్రాంగం తరపున పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని,రోడ్ల మరమ్మతులు,శోభాయాత్రకు అడ్డంకిగా ఉండే చెట్ల కొమ్మలను తొలగించడం వంటి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టడం జరుగుతుందన్నారు.జిల్లాలో సహృద్భావ వాతావరణంలో ఈ వేడుకలు జరుగుతాయని,ఈసారి కూడా అదే స్ఫూర్తిని ప్రదర్శిస్తూ గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలని,జిల్లా ప్రతిష్టను పెంపొందించాలని అన్నారు.జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.మండపాల ఏర్పాటులో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఎవరు కూడా విద్యుదాఘాతం బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.మంటపాల వివరాలను ట్రాన్స్ కో అధికారులకు తెలియజేసి,ఆ శాఖ సిబ్బంది ద్వారానే విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేసుకోవాలని హితవు పలికారు.షార్ట్ సర్క్యూట్ వంటి వాటిని నిరోధించే ఉపకరణాలను అమర్చుకోవాలని హితవు పలికారు.ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడకుండా,ప్రజలకు అసౌకర్యం కలుగకుండా వినాయక మంటపాలు ప్రతిష్టించాలని సూచించారు.8 అడుగుల కంటే తక్కువ ఎత్తు కలిగిన విగ్రహాలను మాత్రమే బాసర గోదావరిలో నిమజ్జనానికి అనుమతిస్తామని,అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను ఉమ్మెడ వద్ద నిమజ్జనం చేయాలని సూచించారు.భారీ శబ్దాల వల్ల చిన్నారులు,వృద్ధులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉన్నందున మంటపాల వద్ద డీ.జే సౌండ్లను నిషేదించడం జరిగిందని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య స్పష్టం చేశారు.మండపాల వద్ద భక్తి పాటలు,భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసేలా నిర్వాహకులు కృషి చేయాలన్నారు.ఇతరులను కించపరిచేలా,అసభ్యకరంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని అన్నారు.మండపాల వద్ద రాత్రి సమయంలోనూ నిర్వాహకులలో ఎవరో ఒకరు తప్పనిసరిగా బస చేయాలని సూచించారు.సాధ్యమైనంత వరకు మట్టి విగ్రహాలను ప్రతిష్టించేలా యువతను ప్రోత్సహిస్తూ పర్యావరణ హితానికి పాటుపడాలని హితవు పలికారు.ప్లాస్టిక్ వినియోగాన్ని కూడా విడనాడితే పర్యావరణానికి ఎంతో మేలు చేసిన వారు అవుతారని అన్నారు.ప్రజలు ఎలాంటి అపోహలు,వదంతులను నమ్మకూడదని,ఎక్కడైనా ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే పోలీసుల దృష్టికి తేవాలని,ప్రతి ఒక్కరు సంయమనం పాటిస్తూ ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని సూచించారు.సమస్యాత్మక ప్రాంతాలు,ప్రార్థనాలయాల వద్ద సి.సి కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తామని పోలీస్ కమిషనర్ సాయిచైతన్య తెలిపారు.సామాజిక మాధ్యమాల పోస్టింగ్ లపై ప్రత్యేక నిఘా ఉంచుతామని,ప్రశాంతతకు భంగం కలిగిస్తూ,అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు.సహృద్భావ వాతావరణంలో పరస్పర సహకారంతో శోభాయమానంగా ఉత్సవాలను నిర్వహించుకోవాలని,వేడుకలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని,ప్రతి మండపం వద్ద పోలీసులను నియమిస్తామని అన్నారు.కాగా వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు విగ్రహాలు నిమజ్జనం చేసే ప్రక్రియను ఆద్యంతం అధికారులు పర్యవేక్షణ జరపాలని,గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతూ క్రేన్,లైటింగ్ వ్యవస్థ,అత్యవసర వైద్యం,అంబులెన్స్,తాగునీరు,బారికేడింగ్,ట్రాఫిక్ క్రమబద్దీకరణ,పారిశుధ్యం వంటి చర్యలు ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను అదనపు కలెక్టర్ భుజంగరావు ఆదేశించారు.విగ్రహాల ఊరేగింపు సమయంలో శోభాయాత్రలో పాల్గొనే వాహనాల్లో ఎటువంటి యాంత్రిక సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని,నిమజ్జన యాత్ర కొనసాగే ప్రాంతాలలో రోడ్లకు ఇరువైపులా కిందికి వేలాడే కరెంటు తీగలు,వంగి ఉన్న చెట్ల కొమ్మలు వంటివి ఏవైనా అడ్డంకులు ఉంటే వాటిని తొలగించాలని,ప్యాచ్ వర్క్ చేపట్టి రోడ్లపై ఏర్పడిన గుంతలను మూసివేయాలని అన్నారు.చెరువులు,గోదావరి పరీవాహక ప్రాంతాల వద్ద సరిపడా సంఖ్యలో క్రేన్ లను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని,అగ్నిమాపక శాఖ అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.గణేష్ ఉత్సవాలు,జెండా బాలాజీ వేడుకల సందర్భంగా నిర్ణీత రోజుల్లో మద్యం విక్రయాలు జరుగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించాలని అవగాహన కల్పిస్తూ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు.సమావేశంలో నగర మేయర్ ఉమారాణి,ట్రైనీ కలెక్టర్ సురేష్,డీఆర్ఓ గీత,నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,ఆర్డీఓలు రాజేంద్ర కుమార్,విజయ కుమారి,ఏసీపీలు ప్రకాష్,వెంకటేశ్వర్ రెడ్డి,శ్రీనివాస్,మస్తాన్ అలీ,వివిధ శాఖల అధికారులు,సార్వజనిక్ గణేష్ మండలి ప్రతినిధులు,శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# స్పీకర్ ను దూషించిన ఎమ్మెల్సీ తాత మధును వెంటనే శాసనమండలి నుండి భర్తరఫ్ చేయాలి - మంథని కాంగ్రెస్ పార్టీ నాయకులు



**మంథని, సెప్టెంబర్ - 08 ( నేటి శుభోదయ దినపత్రిక ) :** ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీనుబాబు ఆదేశాల మేరకు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మంథని పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రధాన రోడ్డుపై బైఠాయించి డప్పులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిలి ప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుదుదుల వెంకన్న, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షులు మంథని సత్యం, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మంథని రాకేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి జనగామ నర్సింగరావు, గ్రామ శాఖ అధ్యక్షులు చంద్రు రాజమల్లు, మాట్లాడుతూ....వర్షాకాలం తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుండి ప్రారంభం కాగా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అతడిని వెంటనే శాసనమండలి నుండి తొలగించాలని అన్నారు. అసెంబ్లీ వద్ద బిఆర్ఎస్ పార్టీ శాసనసభ్యులు చేసిన హంగామా అంతా ఇంతా కాదని వారికి కాంగ్రెస్ ప్రభుత్వం ను విమర్శించడం అలవాటైపోయింది అని కేసీఆర్ ఆదివారం బిఆర్ఎస్ ఎల్పీ సమావేశం నిర్వహించి తమ పార్టీ శాసనసభ్యులకు స్పీకర్ ని దూషించమని దిశానిర్దేశం చేశారని ప్రశ్నించారు. బిఆర్ఎస్ చేస్తున్న అనైతిక చర్యలను ప్రజలందరూ గమనిస్తున్నారని వారికి మళ్ళీ తిరిగి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెబుతారని తెలిపారు. స్పీకర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల చిత్తశుద్ధితో బాధ్యత వహించి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన వ్యాఖ్యల పట్ల నిండు అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కంటతడి పెట్టడం బాధాకరమని వ్యక్తం చేశారు. స్పీకర్ కు కాంగ్రెస్ పార్టీ అండగా నిలబడుతుందని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను,అభివృద్ధి కార్యక్రమాలను చూసి బిఆర్ఎస్ పార్టీ వారు ఓర్చుకోలేకపోతున్నామని వారి ఉనికిని చాటుకునేందుకు రోడ్ల మీదకు వచ్చి ఏవో ఆందోళన కార్యక్రమాలను చేస్తామంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత స్పీకర్‌పై అసభ్య పదజాలం బీఆర్ఎస్ నేతల దురహంకారానికి పరాకాష్ట అని అన్నారు.ఎమ్మెల్సీ తాతా మధు ఒక దళిత స్పీకర్‌ను ఉద్దేశించి తీవ్రమైన పదజాలం ఉపయోగించడం అత్యంత అభ్యంతరకరం, ఇది కేవలం ఒక వ్యక్తిని అవమానించడం కాదు, దళిత స్పీకర్ మనోభావాలను దెబ్బ తీసేలా వ్యవహరించిన తీరుగా తెలంగాణ సమాజం చూస్తోందని తెలిపారు.సభలో మాట్లాడటానికి దమ్ము లేక ప్రజల సమస్యలపై మాట్లాడే ధైర్యం లేక తమ నాయకుడు అసెంబ్లీకి రాకపోవడంపై సమాధానం చెప్పలేక విషయాన్ని పక్కదారి పట్టించేందుకు బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న అడ్డమైన పిచ్చివేషాలు తెలంగాణ ప్రజలకు స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు. రాజకీయ భేదాలు ఉండొచ్చు, విమర్శలు,ప్రతివిమర్శలు చేసుకోవచ్చు కానీ స్పీకర్ పదవికి, వ్యక్తిగత గౌరవానికి, దళితుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే స్థాయిలో అసభ్య పదజాలం ఉపయోగించడం ఏమాత్రం సమర్థనీయం కాదు అని ఈ దురహంకారాన్నీ తెలంగాణ సమాజం ముక్తకంఠంతో ఖండించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,సర్పంచ్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగల నాయకులు, మహిళ నాయకులు పాల్గొన్నారు.

## మహిళా ఎమ్మెల్యేలపై అసెంబ్లీ ఆవరణలో దాడిపై నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ బిఆర్ఎస్ మహిళా నేతల ధర్నా...

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 08 నేటి శుభోదయ :** అసెంబ్లీ ఆవరణలో మహిళా ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి,సబితా ఇంద్రారెడ్డిలపై జరిగిన దాడిని నిరసిస్తూ నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల ఆధ్వర్యంలో ధర్నా చౌక్‌లో బీఆర్ఎస్ మహిళా నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యానికి నిలయమైన అసెంబ్లీ ఆవరణలో మహిళా ప్రజాప్రతినిధులపై దాడి జరగడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని అన్నారు.ప్రజల తరఫున ప్రశ్నించే ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై దాడులు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు.మహిళా ఎమ్మెల్యేలపై దాడికి బాధ్యులైన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళా ప్రజాప్రతినిధులకు రక్షణ కల్పించాలి – ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి అంటూ నినాదాలు చేస్తూ




బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతుకిరణ్, మాజీ కార్పొరేటర్లు విశాలిని రెడ్డి,సిర్ప సువర్ణ, మంజుల యాదవ్,చింత కాయ ల అలేఖ్య, గంగ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## ఐఐఆర్ఆర్ మాన్యువల్ సాయిల్ టెస్టింగ్ కిట్ ఉత్పత్తికి సాంకేతిక ఒప్పందం




**నేటి శుభోదయ, రాజేంద్రనగర్ :** ఐఐఆర్ఆర్ మాన్యువల్ సాయిల్ టెస్టింగ్ కిట్ సాంకేతికత భారీ స్థాయిలో ఉత్పత్తి, ప్రచారం కోసం ఐసిఎఆర్ ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్, హైదరాబాద్, అగ్రిన్నోవేట్ ఇండియా లిమిటెడ్ ద్వారా కర్ణాటకకు చెందిన క్లోనెక్ ఆటోమేషన్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ తో మంగళవారం ప్రత్యేకేతర ప్రాతిపదికన సాంకేతిక లైసెన్స్ ఒప్పందంపై సంతకం చేసింది. క్లోనెక్ ఆటోమేషన్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మట్టి విశ్లేషణ కోసం విప్లవాత్మక పరిష్కారాలను రూపొందించడం ద్వారా మట్టి సాంకేతికత, వ్యవసాయ సమాచార సేకరణ, సంబంధిత క్లౌడ్ సేవల రంగంలో నిమగ్నమై ఉంది. ఈ సంస్థ తన మార్కెటింగ్, సరఫరా నెట్ వర్క్ ద్వారా భారతదేశంలో ఐఐఆర్ఆర్ మాన్యువల్ సాయిల్ టెస్టింగ్ కిట్ సాంకేతికతను తయారు చేసి, మార్కెట్ చేయాలని ఉద్దేశిస్తోంది. ఈ వేగవంతమైన మట్టి ఆరోగ్య పరీక్ష కిట్ తీసుకెళ్లడానికి వీలైనది, వాడుకరికి అనుకూలమైనది, ఉపయోగించడానికి సులభమైనది, వేగవంతమైన ఫలితాలను ఇస్తుంది. ఈ కిట్ మట్టి యొక్క భౌతిక, రసాయన, జీవ సంబంధ అంశాలను వేగంగా పరీక్షించే పద్ధతులను అందిస్తుంది. ఈ కార్యక్రమంలో జాతీయ వరి పరిశోధన సంస్థ సంచాలకులు ఆర్ ఎం సుందరం, క్లోనెక్ ఆటోమేషన్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ విష్ణు ప్రసాద భట్ సంతకాలు చేసి అనుమతి పత్రాలు మార్చుకున్నారు.

## కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు

**ఏన్కూరు, సెప్టెంబర్ 06 (నిత్యం నిఘా ప్రతినిధి) :** మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే కే.శంకరయ్యలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా, ఏన్కూరు పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఫిర్యాదు చేశారు. వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు ఎల్.గిరిబాబు పోలీసులకు సమర్పించిన ఫిర్యాదులో కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫిర్యాదులోని వివరాల ప్రకారం.. కేసీఆర్ నివాసం వద్ద నిర్వహిస్తున్న నిరసనలపై స్పందిస్తూ, ప్రతిపక్ష నేత ప్రాణాలకు హాని కలిగించే రీతిలో ఎమ్మెల్యే శంకరయ్య వ్యాఖ్యానించారని, గతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం ఇదే తరహాలో మాట్లాడారని గిరిబాబు ఆరోపించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న నాయకుడిపై ఇటువంటి వ్యాఖ్యలు చేయడం వారి జీవించే హక్కును భంగపరచడమే కాకుండా, కాంగ్రెస్ కార్యకర్తలను భౌతిక దాడులకు ప్రేరేపించేలా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.



కావున భారతీయ న్యాయ సంహిత పరిధిలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు జరపాలని, అలాగే కేసీఆర్ నివాసం వద్ద భద్రతను మరింత పెంచాలని పోలీసులను కోరారు.

## ఎల్బీనగర్ మహిళల ఆగ్రహం

### - కాంగ్రెస్ ప్రభుత్వ అహంకార ధోరణికి నిరసన





**ఎల్బీనగర్; సెప్టెంబర్, 8 నేటి శుభోదయ :** ప్రజా పాలన, ప్రజా పాలన అంటూ ప్రజా వ్యవస్థనే కూని చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అహంకారపూరిత ధోరణి నశించాలని డిమాండ్ చేస్తూ నిన్న అసెంబ్లీ సాక్షిగా మహిళా ఎమ్మెల్యేలను చూడకుండా జుట్టు పట్టుకొని తోసి వేస్తూ జరిగిన సంఘటనను గుర్తు చేస్తూ ఎల్బీనగర్ మహిళల ఆధ్వర్యంలో ఎల్బీనగర్ చౌరస్తాలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.అందులో భాగంగానే ఒక ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి కేవలం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరుని అనుకరించి వారికి కనుసైగలలోని గౌరవ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారి పై వీర్లపల్లి శంకరయ్య చేసిన అనుచిత వ్యాఖ్యలపై గాను ఆధ్వర్యంలో వీర్లపల్లి శంకరయ్య దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేయడం జరిగింది.ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉంటూ, ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఎల్బీనగర్ మహిళలు తీవ్రంగా ఖండించారు.“420 హామీలతో ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వాన్ని గద్దె దించడానికి మహిళలే చాలు” అని ఎల్బీనగర్ మహిళలు మరోసారి నిరూపించారు.ఎవరి ప్రోద్బలంతో కాకుండా స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన మహిళలు, నిన్న మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తూ పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు.ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం బుద్ధి తెచ్చుకుని, తాము ప్రజా ప్రభుత్వం అని చెప్పుకోవడమే కాకుండా ప్రజల మనోభావాలను గౌరవిస్తూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించాలని ఎల్బీనగర్ మహిళలు డిమాండ్ చేశారు.అనంతరం ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ కు మహిళలు ర్యాలీగా వెళ్లి ఏసిపి గారికి మరియు సిఐ గారికి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో హస్తినాపురం మాజీ కార్పొరేటర్ పద్మనాయక్,మల్లీశ్వరిరెడ్డి,రంగేశ్వరి నాయుడు,శైలజ,రమాదేవి,విజయ,అంజలి,లత,దేవి,మమత,శిల్పరెడ్డి,వాణి,సూరజ్ ఎస్దాని,కల్పన,లక్ష్మి ,పార్వతి,పద్మ తదితరులు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ యువ నాయకుల సదస్సుకు యువతకు ఆహ్వానం

**మేడ్చల్ కలెక్టరేట్, నేటి శుభోదయ, సెప్టెంబరు 8 :** 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యాన్ని పెంచే లక్ష్యంతో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వికసిత్ భారత్ యువ నాయకుల సంభాషణ–2027 కార్యక్రమంలో పాల్గొనాలని మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా యువతకు అధికారులు పిలుపునిచ్చారు. ఎంపికైన యువతకు ప్రధానమంత్రి సమక్షంలో తమ ఆలోచనలు, అభిప్రాయాలను ప్రదర్శించే అవకాశం కల్పించనున్నారు. హైదరాబాద్‌లోని పీఐబీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మై భారత్ తెలంగాణ రాష్ట్ర సంచాలకులు అన్వేష్ చింతల కార్యక్రమ వివరాలను వెల్లడించారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యువజన సేవల సంయుక్త సంచాలకులు వేణుగోపాల్‌రావు సమావేశంలో మాట్లాడారు.2026 ఆగస్టు 17 నాటికి 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న యువత ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు అర్హులు. వికసిత్ భారత్ సవాలు, సాంస్కృతిక విభాగం, భారతదేశం కోసం రూపకల్పన, సామాజిక సమస్యల పరిష్కారం, యువ పారిశ్రామికవేత్తల సవాలు, యువజన పార్లమెంటు విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. తెలంగాణకు




‘సాంకేతికత, నూతన ఆవిష్కరణలు, భవిష్యత్ సన్నద్ధత’ను ప్రాంతీయ అంశంగా నిర్ణయించారు.వికసిత్ భారత్ సవాలులో అంతర్జాల ప్రశ్నావళి, వ్యాసరచన, జిల్లా స్థాయి ప్రజెంటేషన్లు, రాష్ట్ర స్థాయి ఎంపిక ప్రక్రియ ఉంటాయి. జాతీయ స్థాయి తుది పోటీలను 2027 జనవరి 10 నుంచి 12 వరకు న్యూఢిల్లీలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని నిర్వహించనున్నారు. దేశ నిర్మాణంలో తమ ఆలోచనలు, నైపుణ్యాలను వినియోగించేందుకు యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

## భ్రూణ లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు

**మేడ్చల్ కలెక్టరేట్, నేటి శుభోదయ , సెప్టెంబరు 8 :** భ్రూణ లింగ నిర్ధారణ, లింగం వెల్లడించడం వంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడే వైద్య కేంద్రాలపై కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ఆనంద్ హెచ్చరించారు. ఆడ శిశువులపై వివక్ష, భ్రూణహత్యలకు దారితీసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.రాష్ట్రస్థాయి పీసీపీఎన్‌డీటీ ప్రత్యేక కార్యదళం అధికారులు నిర్వహించిన తనిఖీల్లో నిబంధనల ఉల్లంఘనలు గుర్తించిన నేపథ్యంలో జోడిమెట్ల ఎక్స్ రోడ్డు, పోచారం ప్రాంతంలోని అన్ష్ ఆసుపత్రిని డాక్టర్ కె. ఆనంద్ మంగళవారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పీసీపీఎన్‌డీటీ చట్టానికి సంబంధించిన రికార్డులు, నెలవారీ నివేదికలు, తప్పనిసరి రిజిస్టర్లు, నమోదు ధ్రువపత్రం, నిర్దేశిత ప్రమాణాలు, విధివిధానాలను క్షుణ్ణంగా పరిశీలించారు.చట్ట నిబంధనల ప్రకారం ఆసుపత్రి కార్యకలాపాలు కొనసాగుతున్నాయా? నమోదు చెల్లుబాటులో ఉందా? తప్పనిసరి రికార్డులను సక్రమంగా నిర్వహిస్తున్నారా? తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. వైద్య సేవలను ఆసరాగా చేసుకుని ప్రజలను, ముఖ్యంగా మహిళలను మోసం చేయడం లేదా దోపిడీకి పాల్పడటం వంటి చర్యలను సహించేది లేదని డాక్టర్ ఆనంద్ స్పష్టం చేశారు.ప్రతి నమోదిత వైద్య కేంద్రం పీసీపీఎన్‌డీటీ చట్టంలోని అన్ని నిబంధనలు, నిర్దేశిత ప్రమాణాలు, విధివిధానాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. లింగ వివక్షను అరికట్టి ఆడ శిశువుల రక్షణకు భరోసా కల్పించేందుకు జిల్లాలో నిరంతర తనిఖీలు, పర్యవేక్షణ కొనసాగుతాయని తెలిపారు.తనిఖీలో సీఐఏ/పీసీపీఎన్‌డీటీ కార్యక్రమ అధికారి డాక్టర్ గీతా ప్రసాద్, డిప్యూటీ డెమో వసంతరెడ్డి పాల్గొన్నారు.





Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620